


ఆదివారం 5 జూలై 2026 పేజీలు : 8

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి




జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవం తం చేసి అర్హులైన ప్రతి లబ్ధి దారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కా రంలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూ చించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ పీవో మంద మకరందు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, భౌతిక, ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

# దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి

**10--15 ఏళ్ల దీర్ఘకాలిక కార్యాచరణతో ముందుకు సాగాలి సంస్థ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం**

**సింగరేణి వాస్తవ పరిస్థితులను కార్మికులకు పారదర్శకంగా వివరించాలి భవిష్యత్ సవాళ్లు, సంస్కరణల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి**

**రానున్న బొగ్గు గనుల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త బ్లాక్లు సాధించాలి**

**కోల్ గ్యాసిఫికేషన్ రంగంలోనూ సింగరేణి అడుగులు వేయాలి ఉత్పత్తి పెంపుదలతో పాటు సంస్థ దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టి సారించాలి**




# వానకాలం వ్యవసాయ సాగుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలి

రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సాగును విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు రిజిస్ట్రీ, త్రాగునీరు, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.






## దొడ్డి కొమురయ్య త్యాగం సమాజానికి స్ఫూర్తి: అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్

**ఆసిఫాబాద్, జూలై 4 (ప్రజా జ్యోతి** సమాజంలో అణచివేత, అన్యాయం, దోపిడికి వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుడు దొడ్డి కొమురయ్య అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మట్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఆర్వో దాసరి వేణుతో కలిసి ఆయన పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యువరాజ్ మార్మట్ మాట్లాడుతూ, భూస్వాముల ఆగడాలు, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం, త్యాగం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి నదీమ్, జిల్లా



గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ, మాజీ ఎంపీపీ అలిగిల మల్లికార్జున్ యాదవ్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నార్ రమేష్, నాయకులు మాధవ్, దినేష్‌తో పాటు బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వానకాలం వ్యవసాయ సాగుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలి





రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, విద్య, రైతు రిజిస్ట్రీపై సమీక్ష

**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో వానాకాలం వ్యవసాయ సాగును విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వ్యవసాయం, విత్తనాలు, ఎరువులు, ప్రజారోగ్యం, పంటల వైవిధ్యీకరణ, రైతు రిజిస్ట్రీ, త్రాగునీరు, ఇరిగేషన్, విద్య, వాతావరణ మార్పులు, ఉద్యానవనం, సూక్ష్మ సాగునీరు, ఆయిల్ పామ్ విస్తరణ, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వానాకాలం-2026 సీజన్‌లో 138.49 లక్షల ఎకరాలలో సాగు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. రైతులకు అవసరమైన మేరకు 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని 68 మందిని అరెస్టు చేయడంతో పాటు 34 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు . జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ చేయాలని, యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయాలు, నిల్వలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. నానో యూరియా వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని అధికారులకు ఆదేశించారు. రైతు రిజిస్ట్రీ కార్యక్రమంలో రాష్ట్రం దేశంలో ముందంజలో ఉందని, అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తయ్యేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యతనిస్తూ వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు,చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉద్యాన పంటల అభివృద్ధి, సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టుల అమలులో జిల్లాల వారీగా పురోగతిని వేగవంతం చేయాలని అ న్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలోని 33 జిల్లాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జ్వరాలపై ప్రత్యేక నిఘా, ప్రతి శుక్రవారం "డ్రై డే" నిర్వహణ, దోమల నివారణ చర్యలు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన వైద్య సేవలు, మందులు, పరీక్షా కిట్లు, రక్త నిల్వలు, అంబులెన్స్ సేవలు, అత్యవసర చికిత్స సౌకర్యాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలని, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఆధారంగా విద్యార్థుల హాజరు మేరకు ఆహార అవసరాలను అంచనా వేసి వృథాను తగ్గించాలని సూచించారు. ఆహార నాణ్యత, పంపిణీ, పర్యవేక్షణ కోసం డిజిటల్ డ్యాష్‌బోర్డ్‌ను సమర్థంగా వినియోగించాలన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, త్రాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, మిషన్ భగీరథ ఈఈతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సర్వర్ సమస్యలతో ప్రజలకు చుక్కలు!

**మంచిర్యాలరూరల్ జూలై04(ప్రజాజ్యోతి)** తెలంగాణ ప్రభుత్వం భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, వేగవంత మైన సేవల లక్ష్యంతో ఎంతో ప్రతి ష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ ప్రస్తుతం సర్వర్ సమస్యలతో సతమతమవుతోంది. పోర్టల్‌లో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండటంతో రిజిస్ట్రేషన్లు, దరఖాస్తుల సమర్పణ,మ్యుటేషన్,భూ వివరాల పరిశీలన వంటి సేవలు సక్రమంగా అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, పోర్టల్ పదేపదే నిలిచిపోవడం లేదా చాలా నెమ్మదిగా పనిచేయడం వల్ల గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు సమాచారం చేరావేస్తున్నారు. రోజువారీగా భూసంబంధిత సేవల కోసం వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారని వారు పేర్కొంటున్నారు. సర్వర్ సమస్యల కారణంగా రైతులు,భూయజమానులు, కొను గోలుదారులు, విక్రేతలు, విద్యార్థులు,బ్యాంకు రుణాల కోసం భూపత్రాలు అవసరమైన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. అత్యవసర పనులు సైతం ఆలస్యమవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రజలకు సులభంగా, వేగంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన పోర్టల్‌లో ఇటువంటి సమస్యలు కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సర్వర్ సామర్థ్యాన్ని పెంచి, సాంకేతిక లోపాలను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు,మీసేవ కేంద్రాల నిర్వాహకులు రెవెన్యూ శాఖ అధికారులను కోరుతున్నారు. పోర్టల్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తేనే ప్రజలకు ఇబ్బందులు తొలగి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని వారు సూచిస్తున్నారు.

## అటవీ ఆంక్షల వల్ల మధ్యలోనే ఆగిపోయిన సీసీ రోడ్డు

**అవస్థలు పడుతున్న పుట్టిగూడా గిరిజనులు**



**జన్నారం,జూలై4 (ప్రజా జ్యోతి)**జన్నారం మండ లంలోని పొనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పుట్టిగూడ గిరిజన గ్రామానికి వెళ్లే సిసి రోడ్డు నిర్మాణం అటవీశాఖ ఆంక్షల వల్ల మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో పుట్టిగూడ గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ జూన్ 18న ఈ సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఆ తర్వాత కొంతదూరం వరకు సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది కానీ అటవీశాఖ ఆంక్షలు వల్ల సిసి రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో, మట్టి రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆ గ్రామ గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో అత్యవసర పరిస్థితి వస్తే 108 అంబులెన్స్ లోపలికి వెళ్లకుండా రోడ్డు మొత్తం బురద భయంగా మారింది.రోగులు ఆస్పత్రికి వెళ్లాలన్న, విద్యార్థులు బడికి వెళ్ళాలన్న పనుల నిమిత్తం జన్నారం వెళ్లాలన్న ఆ గ్రామస్తులకు ఇదొక్కటే దారి.ప్రస్తుత వర్షాలకు దారంతా బురదమయంగా ఉండడంతో నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే అడవి శాఖ అధికారులు అనుమతులు ఇచ్చి మధ్యలోనే ఆగిపోయిన రోడ్డు పనులు పూర్తి చేసేలా చూడాలని ఆ గ్రామ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారు

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన దొడ్డి కొమురయ్య వర్ధంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనలో అణచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణతో పాటు భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులపై వారిలో చైతన్యం కల్పించి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి



కొమురయ్య చేసిన పోరాటం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. దేశ స్వాతంత్ర్యం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. దొడ్డి కొమురయ్య ఆశయాలు, ఆయన పోరాట స్ఫూర్తి సమాజ నిర్మాణానికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు అండగా రామగుండం షీ టీమ్స్

**భయం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**




**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** మహిళలు, బాలికలు ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, వారి భద్రతకు రామగుండం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, బాలికల రక్షణ కోసం షీ టీమ్స్ నిరంతరం సేవలందిస్తున్నాయని ఆయన శనివారం తెలిపారు .పోలీసు శాఖపై, షీ టీమ్స్‌పై విశ్వాసంతో మహిళలు, బాలికలు తమపై జరుగుతున్న వేధింపులపై ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయడం రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్‌లో ఒక షీ టీమ్, మంచిర్యాల జోన్‌లో రెండు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని అన్నారు .మహిళలు, బాలికలు, చిన్నారులను ఎవరైనా వేధించినా వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని సూచించారు. షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నంబర్ 8712659386, మంచిర్యాల జోన్ షీ టీమ్ నంబర్ 8712659385 ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు కాల్ చేయవచ్చని సూచించారు. మహిళలు సురక్షిత ప్రయాణం కోసం టీ-సేఫ్ (టి-సేఫ్ -- ట్రావెల్ సేఫ్) యాప్‌ను వినియోగించుకోవాలని కోరారు. జూన్--2026 నెలలో రామగుండం షీ టీమ్స్‌కు మొత్తం 70 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఇందులో కార్యాలయాలకు నేరుగా 20 ఫిర్యాదులు, వాట్సాప్ ద్వారా 7 ఫిర్యాదులు, రెడ్ హ్యాండెడ్ కేసులుగా 43 నమోదైనట్లు వివరించారు. ఈ 70 ఫిర్యాదులపై పోలీసులు వివిధ చర్యలు చేపట్టారు. మొత్తం 6 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 23 పెట్టీ కేసులు నమోదు చేశారు. 28 మందికి కౌన్సెలింగ్ నిర్వహించగా, 12 మందిని హెచ్చరించి విడిచిపెట్టారు. ఒక ఫిర్యాదు ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌ల పరిధిలోని షీ టీమ్స్ బహిరంగ ప్రదేశాలు, పార్కులు, షాపింగ్ మాల్స్ తదితర ప్రాంతాల్లో డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి 43 మంది వేధింపుదారులను పట్టుకున్నాయి. వారిపై పెట్టీ కేసులు నమోదు చేయడంతో పాటు వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించినట్లు తెలిపారు. మహిళల భద్రతపై అవగాహన కల్పించేందుకు జూన్ నెలలో పెద్దపల్లి జిల్లాలో 32, మంచిర్యాల జిల్లాలో 30 కార్యక్రమాలు నిర్వహించగా మొత్తం 62 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే హాట్‌స్పాట్ ప్రాంతాల్లో పెద్దపల్లి జిల్లాలో 122, మంచిర్యాల జిల్లాలో 170 తనిఖీలు నిర్వహించి మొత్తం 292 హాట్‌స్పాట్ తనిఖీలు చేసినట్లు వివరించారు .మహిళలు, బాలికలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన, ఈవ్‌టీజింగ్ వంటి సంఘటనలను ఏమాత్రం సహించబోమని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు. బాధితులు నిర్భయంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని సిపి తెలిపారు .

## ప్రజలకు నాణ్యమైన త్రాగునీరే లక్ష్యం



**మంచిర్యాలరూరల్ జులై04(ప్రజాజ్యోతి)**ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించేందుకు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య ఆదేశించారు.శనివారం ఎల్లంపల్లి సెగ్మెంట్‌లోని గుడిపేట నీటి శుద్ధి కేంద్రాన్ని ఈఈ (గ్రిడ్ ఎంబీ) కె. మధుసూదన్,హాజీపూర్ తహసీల్దార్ పుష్పలత, డీఈఈలు, ఏఈఈలు అధికారులతో కలిసి ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని ఫిల్ట్రేషన్,క్లోరినేషన్,నీటి నాణ్యత పరీక్షలు,పంపింగ్ వ్యవస్థ,నిల్వ సామర్థ్యం, విద్యుత్ సరఫరా, యంత్రాల నిర్వహణ,పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రజలకు అందించే త్రాగునీరు అన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్లాంట్‌లో వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న సిబ్బంది నియామక విధానం,విధుల నిర్వహణ, హాజరు,వేతనాల చెల్లింపు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణతో సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలి

**మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13, 36, 28, 02 డివిజన్లలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వే కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నూకల రమేష్, స్థానిక కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల విశ్వనాథ్ ఆలయ పాలకవర్గ చైర్మన్ పదవిని బీసీ వర్గానికి కేటాయించాలి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాలలోని విశ్వనాథ్ ఆలయ పాలకవర్గ చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ, విశ్వనాథ్ ఆలయం ఎండోమెంట్స్ శాఖ పరిధిలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆలయ పాలకవర్గ చైర్మన్ పదవుల్లో ప్రధానంగా అగ్రవర్ణ వైశ్య సామాజిక వర్గానికి చెందిన వారికే అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా, ఏ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించినా ఇదే విధానం కొనసాగుతుండటం బీసీలపై జరుగుతున్న వివక్షకు నిదర్శనమని విమర్శించారు. పాలకవర్గ చైర్మన్‌లు, డైరెక్టర్ల నియామకాలలో అగ్రవర్ణాలకే ప్రాధాన్యం ఇస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు విశ్వనాథ్ ఆలయ పాలకవర్గ చైర్మన్‌గా ఉండేందుకు అర్హులు కారా అని ప్రశ్నించారు. విశ్వనాథ్ ఆలయం అన్ని వర్గాల ప్రజలకు చెందినదేనని, ఎండోమెంట్స్ శాఖ పరిధిలో ఉన్న ఆలయంలో సమాన అవకాశాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్నేళ్లుగా ఒకే వర్గానికి చెందిన వ్యక్తులకే బాధ్యతలు అప్పగించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. అగ్రవర్ణాల ఆధ్వర్యంలో ఆలయ పాలన కొనసాగినా ఆలయం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని, ప్రస్తుతం దీప, ధూప, నైవేద్యాల నిర్వహణకే ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి విషయంలో ప్రజలకు పూర్తి అవగాహన ఉందన్నారు.ప్రస్తుతం విశ్వనాథ్ ఆలయ పాలకవర్గాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సముచిత ప్రాతినిధ్యంతో ఏర్పాటు చేసి, చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా గతంలాగే ఒకే వర్గానికి చెందిన వారిని నియమిస్తే ఇతర సామాజిక వర్గాలకు చెందిన భక్తులు ఆలయానికి దూరమయ్యే పరిస్థితులు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆలయ ఆదాయం తగ్గుముఖం పట్టిందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఆలయ అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విశ్వనాథ్ ఆలయ పాలకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించి, చైర్మన్ పదవిని బీసీ వర్గానికి కేటాయించాలని బీసీ సమాజ్ తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని నరెడ్ల శ్రీనివాస్ కోరారు.

# బహిరంగ మద్యం సేవనంపై నిషేధాజ్ఞల కొనసాగింపు

**డీజేలు, డ్రోన్లపై కఠిన చర్యలు**

**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమలు**

**సీపీ అంబర్ కిశోర్ ఝా**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలులో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు సీపీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. అలాగే అనుమతి లేకుండా డీజే సౌండ్స్ వినియోగం, డ్రోన్ల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు .శనివారం ఆయన సిపి మాట్లాడుతూ, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనిపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. మద్యం మత్తులో వీధులు, రహదారులపై అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వల్ల సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమలులో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ ఉత్తర్వులు జూలై 1, 2026 నుంచి ఆగస్టు 1, 2026 వరకు అమల్లో ఉంటాయని, పరిస్థితులను బట్టి వాటి కాలపరిమితిని పొడిగించే అవకాశం కూడా ఉందన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం-1348 ఫసలీ నిబంధనల ప్రకారం నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్స్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను కూడా పొడిగించినట్లు సీపీ తెలిపారు. అధిక శబ్దాలతో చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఏదైనా కార్యక్రమంలో మైక్ సెట్ వినియోగించాల్సి వస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే పోలీసుల అనుమతి లేకుండా డ్రోన్ల వినియోగం కూడా నిషేధితమని తెలిపారు. డ్రోన్లను వినియోగించాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. డీజే సౌండ్స్, డ్రోన్లపై నిషేధాజ్ఞలు కూడా జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు అమల్లో ఉంటాయన్నారు .ఇదే సమయంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ చట్టం అమల్లో ఉన్నట్లు సీపీ తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జూలై 1 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 1 ఉదయం 6 గంటల వరకు ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. బంద్‌ల పేరుతో వ్యాపార సంస్థలు, కార్యాలయాలను బలవంతంగా మూసివేయించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలని సీపీ అంబర్ కిశోర్ ఝా విజ్ఞప్తి చేశారు.

# క్వాలిటీ సంబంధిత కార్యకలాపాల్లో ఎస్‌పీపీని సమర్థవంతంగా వినియోగించుకోవాలి

**సంపూర్ణంగా వినియోగిస్తే పనితీరు మరింత మెరుగుపడుతుంది**

**సిస్టమ్స్, అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్ (ఎస్ఏపీ) వినియోగంపై బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ విభాగానికి వన్ డే వర్క్‌షాప్**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని క్వాలిటీ విభాగం అధికారులు, ల్యాబ్ ఇన్‌చార్జీలు, ఉద్యోగులు, సిబ్బందికి సిస్టమ్స్, అప్లికేషన్స్ అండ్ ప్రొడక్ట్స్ ఇన్ డేటా ప్రాసెసింగ్ (ఎస్ఏపీ) వినియోగంపై అవగాహన కల్పించేందుకు శనివారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో వన్ డే వర్క్‌షాప్ నిర్వహించారు. బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం పి. వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలకు చెందిన క్వాలిటీ ఇన్‌చార్జీలు, ల్యాబ్ ఇన్‌చార్జీలు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్వాలిటీ కాన్సెప్ట్‌ల ఆధారంగా వినియోగదారులకు సరఫరా చేసే బొగ్గు గ్రేడ్‌లకు సంబంధించిన వివరాలను ఎస్ఏపీ వ్యవస్థలో ఏ విధంగా నమోదు చేయాలనే అంశంపై అధికారులు అవగాహన కల్పించారు. అలాగే క్వాలిటీ సంబంధిత కార్యకలాపాల్లో ఎస్ఏపీని సమర్థవంతంగా, సంపూర్ణంగా వినియోగించుకోవడం ద్వారా పనితీరు మరింత మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేట్ కార్యాలయం నుంచి జి. రవికుమార్, అనుదీప్ పాల్గొని పలు సూచనలు చేశారు. అదేవిధంగా శ్రీరాంపూర్ ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జ్ మురళీకృష్ణ, బెల్లంపల్లి క్వాలిటీ ఇన్‌చార్జ్ రాజేష్, మందమర్రి క్వాలిటీ ఇన్‌చార్జ్ ప్రదీప్, క్వాలిటీ ల్యాబ్ ఇన్‌చార్జ్ మోహన్‌తో పాటు మూడు ఏరియాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది హాజరయ్యారు.

# కోటపల్లిలో ఓటరు సవరణ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని బూత్ నంబర్--207లో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్ ఫారాల నింపివేత కార్యక్రమంను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బీజేపీ పార్టీ పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ మంత్రి రామయ్య పాల్గొని ఓటర్లతో కలిసి ఫారాలను నింపించి బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) నీరటి పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ షేగం చంద్రయ్య, బీజేపీ పార్టీ బీఎల్ఏ-2 ప్రతినిధులతో కలిసి ఓటర్లకు సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నర్సింహులు, బీజేపీ కోటపల్లి మండల వైస్ ప్రెసిడెంట్ ఇప్ప సంపత్ పాల్గొని ఓటరు నమోదు, సవరణల ప్రాధాన్యంపై ప్రజలకు వివరించారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని నాయకులు సూచించారు.

## మంచిర్యాల మహాప్రస్థానంపై కార్పొరేటర్ల ఆరోపణల్లో నిజం లేదు

**సొసైటీ ప్రతినిధి గుండా సుధాకర్ రూ.10.50 కోట్లతో నిర్మాణం..**

**602 దహన సంస్కారాలు, 105 మందికి ఉచిత సేవలు**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మహాప్రస్థానం పై కొందరు కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణలను మంచిర్యాల చారిటబుల్ వెల్ఫేర్ సొసైటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సొసైటీ ప్రతినిధి గుండా సుధాకర్ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో గుండా సుధాకర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని మహాప్రస్థానం సేవా కార్యక్రమాలపై కొందరు కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక కార్పొరేటర్లు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా తోసిపుచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కేటాయించిన రూ.10 కోట్ల 50 లక్షల నిధులతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ మహాప్రస్థానాన్ని నిర్మించామని తెలిపారు. లాభాపేక్ష లేకుండా కేవలం సేవా దృక్పథంతోనే మహాప్రస్థానాన్ని నిర్వహిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు మహాప్రస్థానంలో మొత్తం 602 దహన సంస్కారాలు నిర్వహించగా, అందులో నిరుపేదలకు చెందిన 105 మందికి పూర్తిగా ఉచితంగా అంతిమ సంస్కారాలు నిర్వహించినట్లు గణాంకాలతో సహా తెలిపారు .మహాప్రస్థానం ద్వారా వందలాది మందికి సేవలు అందించినప్పటికీ రాజకీయ స్వార్థం కోసం ఇలాంటి పవిత్రమైన సేవా సంస్థపై నిరాధార, అసత్య ఆరోపణలు చేయడం సరికాదని గుండా సుధాకర్ అన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, సేవా కార్యక్రమాల వెనుక ఉన్న నిజాలను గుర్తించాలని కోరారు. మహాప్రస్థానం సమాజ సేవే లక్ష్యంగా పని చేస్తోందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన అన్నారు.

## పామ్ ఆయిల్ పంట లాభదాయకం :

**ఎంఏవో వినోద్ కుమార్**



**సోన్, జూలై 04(ప్రజా జ్యోతి):** పామ్ ఆయిల్ పంట రైతులకు అత్యంత లాభదాయకమైన పంట అని మండల వ్యవసాయ అధికారి (ఎంఏవో) జి. వినోద్ కుమార్ తెలిపారు. సోన్ మండలంలోని పాకపట్ల గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రాజ్‌కుమార్‌తో కలిసి రైతులకు ఆయిల్ పామ్ సాగుపై శనివారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో పెట్టుబడి తక్కువగా ఉండి, దిగుబడి అధికంగా ఉంటుందని తెలిపారు. ఒకసారి మొక్కలు నాటితే సుమారు 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు వివిధ రకాల ప్రోత్సాహకాలు, సబ్సిడీలు అందిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పలువురు రైతులు ఆయిలపామ్ పంట సాగు కోసం దరఖాస్తు చేసుకున్నారు.ఆయిల్ పామ్ పంటకు మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో ఉండటంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని వివరించారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమం లో రైతులు లోకేష్,సుధాకర్, సృజన్ మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఉచిత న్యాయ సేవలపై అవగాహన



**మందమర్రి, జూలై 04 (ప్రజాజ్యోతి):** ప్రజలు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైనప్పుడు ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, మంచిర్యాల కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎ. నిర్మల అన్నారు.శనివారం మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో మెప్మా గ్రూప్ రిసోర్స్ పర్సన్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బందికి లోక్ అదాలత్, ఉచిత న్యాయ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మొబైల్ వ్యాన్ ద్వారా న్యాయ వ్యవస్థ, ఉచిత న్యాయ సేవలు, ప్రజలకు ఉన్న చట్టపరమైన హక్కులపై దృశ్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.అనంతరం జరిగిన సమావేశంలో ఎ. నిర్మల మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, భూ వివాదాలు, గృహహింస, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి వివరించారు. అవసరమైన సమయంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.కార్యక్రమానికి ముందు మున్సిపల్ కమిషనర్ టి. రాజలింగు ఎ. నిర్మలను పుష్పగుచ్ఛంతో స్వాగతించి, శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మంచిర్యాల అధ్యక్షుడు కొత్త సత్తయ్య, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.డి. సందాని, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్లు ఆర్.ఆర్. రాములు, ఎస్. సదయ్య, రెవెన్యూ అధికారి పి. కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ ఎ. రఘురాం, న్యాయవాదులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో పార్లమెంటరీ స్థాయి సంఘం సమావేశానికి హాజరైన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**సైన్స్, టెక్నాలజీ -- పర్యావరణ పరిరక్షణ అంశాలపై కీలక చర్చలు**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** న్యూఢిల్లీలో శనివారం నిర్వహించిన సైన్స్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు మరియు వాతావరణ మార్పులపై పార్లమెంటరీ స్థాయి సంఘం (స్టాండింగ్ కమిటీ) సమావేశానికి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ సమావేశంలో దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించే చర్యలు, స్థిరమైన అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల పురోగతి తదితర అంశాలపై కమిటీ సభ్యులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివృద్ధికి దోహదపడే అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా కమిటీ సూచనలు, సిఫార్సులు ఉండేలా సభ్యులు చర్చలు జరిపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తమ డిమాండ్లపై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరసనలు కొనసాగుతాయి

**శ్రీరాంపూర్ ఏరియాలో ఆరో రోజు కూడా**

**కొనసాగిన రిలే నిరాహార దీక్షలు**

**నేటి దీక్షల్లో పాల్గొన్న సింగరేణి మహిళా అధికారులు**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి అధికారులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం నాటికి ఈ రిలే నిరాహార దీక్షలు ఆరో రోజుకు చేరుకున్నాయి. సింగరేణి వ్యాప్తంగా కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా( సిఎంఓఏఐ) పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఈ దీక్షలో పాల్గొన్న మహిళా అధికారులు శాంతియుతంగా దీక్షను కొనసాగించడం విశేషం . ఆరో రోజు రిలే నిరాహార దీక్షలో సుమలత (ఏజీఎం--ఫైనాన్స్), వరలక్ష్మి (మేనేజర్ ఎస్టేట్స్), పద్మ (సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్), లిఖిత (అసిస్టెంట్ మేనేజర్--ఆర్కే-7), ప్రత్యూష (అసిస్టెంట్ మేనేజర్--ఆర్కే-7), లక్ష్మి (అసిస్టెంట్ మేనేజర్--ఆర్కే-7)తో పాటు పలువురు మహిళా అధికారులు పాల్గొన్నారు. కాగా శనివారం సాయంత్రం పెద్ద సంఖ్య లో ఏరియా అధికారులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం వెంటనే అధికారుల డిమాండ్లపై స్పందించాలని నినాదాలు చేశారు. పే అప్‌గ్రేడేషన్, పీఆర్పీ చెల్లింపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారంపై యాజమా న్యం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ నిరసన కార్యక్రమా లు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు. జూలై 13 వరకు నిర్వహించే రిలే నిరాహార దీక్షల్లో పెద్ద సంఖ్యలో అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని, ప్రతి రోజు దీక్షల్లో పాల్గొనే వారికి ఏరియా అధికారులు సంఘీభావం ప్రకటించాలని కోరారు.

# దక్షిణ భారతదేశ ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషించాలి

**10--15 ఏళ్ల దీర్ఘకాలిక కార్యాచరణతో ముందుకు సాగాలి సంస్థ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం**

**సింగరేణి వాస్తవ పరిస్థితులను కార్మికులకు పారదర్శకంగా వివరించాలి భవిష్యత్ సవాళ్లు, సంస్కరణల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి**

**రానున్న బొగ్గు గనుల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త బ్లాక్లు సాధించాలి**

**కోల్ గ్యాసిఫికేషన్ రంగంలోనూ సింగరేణి అడుగులు వేయాలి ఉత్పత్తి పెంపుదలతో పాటు సంస్థ దీర్ఘకాలిక వృద్ధిపై దృష్టి సారించాలి**

**హైదరాబాద్ సింగరేణి భవన్లో సింగరేణిపై ప్రత్యేక సమీక్షలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**

**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** దక్షిణ భారతదేశంలో ఏకైక ప్రధాన బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ రానున్న రోజుల్లో తన సేవలను మరింత విస్తరించుకోవాలని, కొత్త గనులను సాధించి పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు తోడ్పాటు అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని సింగరేణి భవన్లో సింగరేణి సంస్థ పనితీరు, భవిష్యత్ కార్యాచరణపై శనివారం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సుదీర్ఘంగా సమీక్షను నిర్వహించారు. పలు విషయాలను తెలిపారు .ఈ సందర్భంగా గనుల ఉత్పత్తి, రవాణా, ఓవర్బర్డెన్ తొలగింపు, కొత్త గనుల పురోగతి, వాటి ఉత్పత్తి సామర్థ్యం, అనుమతుల స్థితిగతులపై గనుల వారీగా కూలంకషంగా సమీక్షించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు కోసం కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంపాటల్లో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త బ్లాక్లను సాధించాలని సూచించారు.దేశంలో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో రానున్న 10 నుంచి 15 సంవత్సరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశ ఇంధన రంగంలో ఇంకా సుదీర్ఘ కాలం బొగ్గు కీలక పాత్ర పోషించనున్నందున ఉత్పత్తి పెంపుతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి పని సామర్థ్యాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని సూచించారు. వాణిజ్య విజయాలకు మాత్రమే పరిమితం కాకుండా దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు సాగాలని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ రంగ సంస్థలు నిలదొక్కుకోవాలంటే నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సంస్థ వాస్తవ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులపై పారదర్శక అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కంపెనీ అభివృద్ధి, సంస్కరణల అమలుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. సంస్థ అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.




**బొగ్గు గ్యాసిఫికేషన్పై దృష్టి సారించాలి.....**

దేశంలో కోల్ గ్యాసిఫికేషన్కు విస్తృత అవకాశాలు ఉన్నాయని జి. కిషన్ రెడ్డి తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థగా ప్రారంభ దశలో చిన్న స్థాయిలో అయినా కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న ఎరువుల పరిశ్రమలు, ఇతర పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**ఎల్నినో ప్రభావానికి ముందస్తు ప్రణాళిక అవసరం......**

ప్రపంచవ్యాప్తంగా మరియు దేశంలో ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశముందని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తికి తగినంత బొగ్గు అందించేందుకు కోల్ ఇండియాతో పాటు సింగరేణి కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో విద్యుత్ అవసరాలు పెరగనున్న నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను ముందుగానే బలోపేతం చేసి నిరంతర ఇంధన సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉత్పత్తి పెంపుకు అనుగుణంగా రవాణా వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని, రవాణా కాంట్రాక్టులను వేగంగా ఖరారు చేసి అదనపు ఉత్పత్తి వినియోగదారులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఉద్యోగులే సంస్థ బలం......**

సింగరేణి అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సంస్థ భవిష్యత్ ప్రణాళికల్లో ఉద్యోగులను భాగస్వాములుగా చేసుకుని వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సంస్థ విజయాన్ని తన విజయంగా భావించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి స్వాగతం పలుకుతూ సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ప్రస్తుత సవాళ్లపై వివరించారు. కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడంలో ఎదురవుతున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సింగరేణికి సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజెస్ హోదా తొలగించడం వల్ల అటవీ భూ సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. దీనిపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని జి. కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గు రవాణా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతామని తెలిపారు.ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, సంయుక్త కార్యదర్శి సంజీవ్ కుమార్ కస్సి, ప్రైవేట్ సెక్రటరీ పంకజ్ జైన్, బొగ్గు శాఖ సలహాదారులు వీరా రెడ్డి, సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్పీ-3, 3ఏ గని ప్రమాద బాధితులను పరామర్శించిన టీబీజీకేఎస్ నాయకులు



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ–3, 3ఏ గనుల్లో సైడ్ ఫాల్ కారణంగా జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులు సంపత్ (కోల్ కట్టర్), రవి (సపోర్ట్ మెన్)లను రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఫిట్ సెక్రటరీ తీగల వెంకటరెడ్డి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ తౌటి నరేష్, ఏరియా నాయకుడు పనుగంటి వినయ్ కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రమాదం జరిగిన తీరుపై వివరాలు సేకరించారు. బాధిత కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. అలాగే కార్మికుల సంక్షేమం, భద్రత విషయంలో సంస్థ యాజమాన్యం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని నాయకులు సూచించారు

## ఆదిలాబాద్ ఆర్ టిసి ఆర్ యం కార్యాలయంలో ఘనంగా మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి



**ఆదిలాబాద్ టౌన్, జూలై 4, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ఆర్టీసీ చైర్మన్ల ఆదేశాల మేరకు స్థానిక ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఆదిలాబాద్ కార్యాలయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్, దివం గత కొణిజేటి రోశయ్యజయంతిని వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి డిప్యూటీ ఆర్ ఎం (ఎం) ఎస్.రామయ్య , ఎ ల్.రమేష్ ఏఒ, ఆర్ జి జిబ్లా ఆర్ ఎం ఆఫీస్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## మాంగ్ కుల అస్థిత్వాన్ని కాపా డిన సీఎం రేవంతన్నకు వేల వేల దండాలు

**మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు గాడేకర్ పరుశురాం మాంగ్**




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం న్యాయమైన డిమాండ్, మాంగ్ సమాజ్ ప్రజల చిరకాల స్వప్నం మాం గ్ కులానికి కుల ధృవీకరణ పత్రం తహశీల్దార్ ద్వారా జారీ చేయాలనే ఉత్తర్వును జారీ చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వా నికి మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు గాడేక ర్ పరశురామ్ మాంగ్ కృతజ్ఞతలు తెలిపారు. మాంగ్ స మాజ్ ప్రజలు ఆర్డీఓ కార్యాలయం ద్వారా కుల ధృవీకరణ పత్రం సకాలంలో పొందలేక చాలా ఇబ్బందులు పడుతూ వచ్చారు. గతంలో ఈ కుల ధృవీకరణ పత్రం పొందుటలో ఉన్న ఇబ్బందులను భరించ లేక మాంగ్ సమాజ్ ప్రజలు తహశీల్దార్ కార్యాలయం ద్వా రా సులభంగా కుల ధ్రువీకర ణ పత్రం లభించే కులం పేరుతొ పత్రాలు పొందడం వలన రాష్ట్రంలో మాంగ్ కులం ఉనికి, అస్థిత్వానికి ప్రమాదం వాటిల్లింది. మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షులు గాయక్వాడ్ తులసిదాస్ మాంగ్ న్యాయమైన కోరికను మన్నించి మాంగ్ సమాజ్ ఆత్మగౌరవం, ఉనికిని కాపా డుతూ మాంగ్ కులానికి కుల ధృవీకరణ పత్రం జారీ చేసే అధికారం తహశీల్దార్ కు ఇస్తూ ప్రభుత్వ ఉత్త ర్వులను జారీ చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డికి సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్కి కృతజ్ఞతలు తెలుపుతూ మాంగ్ సమాజ్ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఇక నుంచి మాంగ్ కులం పేరుతో తప్పుడు కుల ధృవీకరణ పత్రం జారీ కాకుండా చూసే బాధ్యత ప్రతి సభ్యుడి పైన ఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర అధ్యక్షులు చెప్పారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి గాయ్ కాంబ్లే కుషాల్ రావు మాంగ్, ఇంద్రవెల్లి మండలం అధ్యక్షులు వాగ్మారే అంకుష్ మాంగ్,గోత్ముక్లె సుభాష్ మాంగ్ సర్పంచ్ భోస్ర, జాదవ్ గణే ష్ బాబు, హరిదాస్ మాంగ్, సూర్యవంశి సాయి మాంగ్ సమాజ్ సంఘ సభ్యులు ఆనందంతో పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సిలింగ్

**ఈ నెల 6న నిర్వహణ.. అర్హులు హాజరు కావాలి**

**టీజీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ ప్రిన్సిపాల్ రామ కళ్యాణి**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో మిగిలి ఉన్న ఖాళీల భర్తీకి ఈ నెల 6న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు టీజీఎస్‌డబ్ల్యూఆర్ఐఈఎస్ ప్రిన్సిపాల్ రామ కళ్యాణి శనివారం తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని బాలుర జూనియర్ కళాశాలలు బెల్లంపల్లి, సీఓఈ జైపూర్, మంచిర్యాల, కాసిపేటతో పాటు బాలికల జూనియర్ కళాశాలలు లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లిల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం గ్రూపుల్లో కొద్దిపాటి ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బాలికలకు లక్షెట్టిపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో, బాలురకు జైపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో ఈ నెల 6న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తుల నమోదు ప్రక్రియ చేపట్టి, మధ్యాహ్నం 1 గంట తర్వాత మెరిట్ జాబితా ప్రకటించి, 2 గంటల తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి సీట్ల కేటాయింపు జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. మార్చి--2026లో నిర్వహించిన ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పరీక్షల్లో ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని తెలిపారు. పదో తరగతి మార్కులు, కుల రిజర్వేషన్ల ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆగస్టు 31, 2026 నాటికి అభ్యర్థుల వయస్సు 17 సంవత్సరాలు మించకూడదని, ఎస్సీ అభ్యర్థులకు ఒక సంవత్సరం సడలింపు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే జోనల్ కార్యాలయం లేదా ఇతర కళాశాలల్లో దరఖాస్తు చేసుకున్నవారు కూడా స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని అన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు మరుసటి రోజే కళాశాలలో చేరాల్సి ఉంటుందని, ఈ నెల 10లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించని పక్షంలో ప్రవేశం రద్దు చేయబడుతుందని తెలిపారు.

# తగ్గింపు పేరుతో పూర్తి బిల్లు?.. వాంకిడి ఫెర్టిలైజర్ దుకాణాలపై రైతుల ఆరోపణలు

**ఎరువుల బిల్లింగ్‌లో అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్**

**రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్పెల్లి జైరామ్ స్పందన**



**ఆసిఫాబాద్ జులై 4 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని కొన్ని ఫెర్టిలైజర్ దుకాణాల వ్యాపార విధానంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువులపై నోటిమాటగా తగ్గింపు ఇస్తున్నట్లు చెప్పి, చివరకు బిల్లులో మాత్రం పూర్తి ధరనే నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు, ఎంఆర్పీ రూ. 266గా ఉన్న ఎరువుకు రూ. 360--370 వరకు బిల్లులు ఇస్తున్నారని, ఒక రకంగా వసూలు చేసి మరో విధంగా బిల్లులు నమోదు చేస్తున్నారని రైతులు రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్పెల్లి జైరామ్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ సీజన్‌లో ధరలు, బిల్లింగ్ విధానాలపై పూర్తి అవగాహన లేని రైతులు అధిక మొత్తాలు చెల్లించి నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల ధరల నిర్ణయం, బిల్లింగ్ విధానం, రాయితీల అమలు, స్టాక్ నిర్వహణ తదితర అంశాలపై వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజీ, వాణిజ్య పన్నుల శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై స్పందన కోసం ఫెర్టిలైజర్ దుకాణాల యూనియన్‌కు చెందిన ఓ వ్యాపారిని మీడియా ప్రతినిధులు సంప్రదించగా, “ఏం రాస్తారో రాసుకోండి... మేమంతా నిజాయితీగా వ్యాపారం చేస్తున్నాం” అని స్పందించినట్లు సమాచారం. అదే సమయంలో పాత్రికేయుల పేర్లను ఒక డైరీలో నమోదు చేసినట్లు కొందరు విలేకరులు పేర్కొన్నారు. దీనిపై కూడా సంబంధిత వర్గాల నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్పెల్లి జైరామ్ మాట్లాడుతూ, వాంకిడి మండలంలోని కొన్ని ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. రైతులకు తగ్గింపు ఇచ్చినట్లు చూపించి బిల్లులో పూర్తి ధర నమోదు చేస్తున్నారనే ఆరోపణలపై అధికారులు లోతైన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని దుకాణాల్లో లైసెన్సులు, అనుమతులు, ఇతర చట్టబద్ధ పత్రాలపై కూడా సందేహాలు ఉన్నాయని, ఒకరి పేరుపై లైసెన్సు ఉండి మరొకరు రెండు, మూడు దుకాణాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత శాఖలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. రైతుల కష్టార్జిత ధనానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించకూడదని, అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జైరామ్ డిమాండ్ చేశారు. అదే సమయంలో ఆరోపణలు నిరాధారమైతే అధికారులు అధికారికంగా స్పష్టత ఇచ్చి రైతుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు.

## ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** ఈ వీ ఎంల భద్రత, నిర్వాహ ణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తా వు లేకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం శాంతినగర్‌లోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ నిఘా, ప్రవేశ నియంత్రణ, ఈవీఎంల నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎంల భద్రత, సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గోదాం వద్ద 24 గంటల భద్రతా పర్యవేక్షణ కొనసాగించాలని, సీసీటీవీ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్వా హణ రిజిస్టర్లు, లాగ్‌బుక్‌లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, నాయబ్ తహసీల్దార్, సంబంధిత రెవెన్యూ, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**



**సిరికొండ, జూలై 4 (ప్రజా జ్యోతి)** రైతులకు అండగా కాంగ్రెస్ ప్ర భుత్వం నిలుస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం కింద ఎకరానికి 6,000 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న సందర్భంగా, సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్ర పటానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షులు కంచం లక్ష్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు భగనురే మాధవ్ పటేల్ మా ట్లాడుతూ, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సెక్రటరీ షేక్ ఇమామ్, సర్పంచ్‌ల సంఘము అధ్యక్షులు, సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, ఉప సర్పంచ్‌ల సంఘము అధ్యక్షులు తోకల రాజు,మాజీ జడ్పీటీసీ కుంరం చంద్రకళ రఘురామ్,సొన్ పల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, కుంట గూడ సర్పంచ్ మీరాబాయి యాదవ్ రావు,ఏఎంసీడైరక్టర్, ప్రకాష్,మాజి అధ్యక్షులు షేక్ ఇమామ్, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్,కస్బె రామారావు, సందీప్, గాజు,సంజీవ్, రషీద్, బషీర్, కిసాన్, ఎల్లయ్య, నర్సియ్య, తిరుపతి, పూసంసత్తి, మల్లేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా కళాశాలకు ఎస్బిఐ బ్యాంక్ (చేయూత) కుర్చీల బహుకరణ




నిర్మల్,జూలై 04 (ప్రజా జ్యోతి):తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల సోఫీ నగర్ నిర్మల్ ఎన్.ఎస్. ఎస్ ఆధ్వర్యంలో గురుకులంలో వన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్బిఐ తన్వి బ్రాంచ్ మేనేజర్ మాలోత్ రవి హాజరై మొక్కలు నాటి విద్యార్థులకు బ్యాంకు సిబ్బంది సహాయం తో కుర్చీలను అందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. కవిత విద్యార్థులు వేసిన రంగోలి, మొక్కలపై విద్యార్థులు చేసిన ప్రాజెక్టు వర్క్‌లను చూసి, మరియు మొక్కలను నాటి విద్యార్థులను అభినం దించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది యం. నరసయ్య, వైస్ ప్రిన్సిపల్ వీణ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అమృత, అధ్యాపక బృందం ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇచ్చోడ ఎస్సీ గురుకుల కళా శాలలో సీట్లకు 6న స్పాట్ కౌన్సిలింగ్

ప్రిన్సిపల్ వినోద్ సొద

ఇచ్చోడ, జూలై 4 (ప్రజా జ్యోతి) అదిలాబాద్ జిల్లాలోని ఎస్సీ గురుకుల కళాశాలలో మిగిలి న పరిమిత సీట్లు భర్తీ చేసేం దుకు ఈనెల 6న స్పాట్ కౌన్సి లింగ్ నిర్వహిస్తున్నట్లు ఇచ్చోడ గురుకుల ప్రిన్సిపాల్ వినోద్ సొదా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పాట్ కౌన్సిలింగ్ అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్సీ సిఒఈ బాలికల కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. పరిమిత సీట్లు ఉన్నాయని ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రెండు విడుతల్లో ప్ర వేశ పరీక్షలు ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేయడం జరిగిం దని, మిగిలిన సీట్ల కోసం ఈ నెల 6నిర్వహిస్తున్న కౌన్సె లింగ్ కు అర్హత గల అభ్యర్థులు ఎస్సీ కులానికి చెంది సంబంధించిన విద్యార్హతలతో పాటు ఆదాయం నివాస ధ్రువీకరణ పత్రాలు అదిలాబాద్ పట్టణంలోని ఎస్సీ బాలికల కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు హాజరై అర్హత అనుకూలంగా సీట్లు పొందాలని ప్రిన్సిపాల్ వినోద్ సొదా కోరారు.

## ఎస్సీ వాడాలో మురుగు నీరు.. తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు



ఆసిఫాబాద్ , జూలై 4 ప్రజా జ్యోతి కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబర గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ వాడాలో మురుగు నీరు ఇండ్లలోకి చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు ప్రజలు నిత్యజీవి తాన్ని ఇబ్బందులతో గడుపుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో పాములు, దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారని, దోమల కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యను పలుమార్లు గ్రామపం చాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని కాలనీవాసులు ఆరోపించారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా కాలు వలను శుభ్రం చేసి, ఎస్సీ వాడా ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.

# బీఎంఎస్ చేస్తున్న ఆరోపణలు కార్మికులను పక్కదారి పట్టించే ప్రయత్నమే

### లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలి

### సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు




మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి): సింగరేణి కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, కార్మిక సంఘాల పరిరక్షణ వంటి కీలక అంశాలపై చర్చ జరగాల్సిన సమయంలో బీఎంఎస్ చేస్తున్న ఆరోపణలు కార్మికు లను అసలు సమస్యల నుండి పక్కదారి పట్టించే ప్రయత్నమేనని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు తీవ్రంగా విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ సమస్యలను మరుగునపరచి ఆరోపణలతో కాలం గడపడం సరైన విధానం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు, కార్మిక సంఘాల ఉనికిని బలహీనపరిచే విధంగా లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆయన ఆరోపించారు. దేశంలో ఇప్పటి వరకు అమలులో ఉన్న 12 ప్రధాన కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి ప్రయత్నించడం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. కార్మిక చట్టాలు, కార్మిక సంఘాలను లేబర్ కోడ్‌ల పేరిట నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రశ్నించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత కలిగిన సంఘాలు ఈ అంశంపై స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 5, 2026న జరిగిన అపెక్స్ కమిటీ సమావేశంలో లేబర్ కోడ్‌ల అమలుపై చర్చ జరిగినప్పటికీ, వాటి వల్ల కలిగే నష్టాలపై పూర్తి స్థాయిలో చర్చ జరగలేదని ఆయన తెలిపారు. యాజమాన్యం పై కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి కారణంగా లేబర్ కోడ్‌ల అమలుకు దారులు వేస్తున్నారనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. దేశవ్యాప్తం గా కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిశీలిస్తే సుమారు 51 శాతం కార్మిక సంఘాలు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నాయని, అలాంటి సమయంలో బీఎంఎస్ మాత్రం ప్రభుత్వ విధానాలకు మద్దతు పలకడం ఆశ్చర్యకరమని అన్నారు. కార్మికుల పక్షాన నిలబ డాల్సిన సంఘం ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలను సమర్థించడం వెనుక ఉద్దేశం ఏమిటో కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, వేతన ఒప్పందాలు, కార్మిక హక్కులు, ఉద్యోగ భద్రత వంటి కీలక అంశాలపై పోరాడాల్సిన సమయంలో బీఎంఎస్ చేస్తున్న ఆరోపణలు అసలు సమస్యలను మరుగునపరచి కార్మికులను తప్పుదోవ పట్టించడానికేనని మంద నరసింహారావు పేర్కొన్నారు. కార్మికులు వాస్తవాలను అర్థం చేసుకుని ఐక్యంగా ముందుకు రావాలని, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# డబుల్ రిటర్న్స్ పేరుతో డిపా జిట్లు సేకరించి ప్రజలను మోసం చేసిన ప్రధాన నిందితుడు అరెస్ట్ రిమాండ్

యూనిక్ ఎస్ ఎం సీ ఎస్ కం పెనీ పేరిట ప్రజలను మోసం చేసిన ప్రధాన నిర్వాహకుడిని అరెస్టు చేసిన జైనథ్ పోలీసులు

జిల్లాలో నమోదైన 6 కేసుల్లో 40 మంది బాధితులు

సుమారు రూ.19 లక్షల పెట్టు బడులు మోసం

రాష్ట్రవ్యాప్తంగా బాధితులు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవ న్ రెడ్డి



ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి) డబుల్ రిటర్న్స్ వస్తాయ ని ఆశ చూపిస్తూ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి మోసాని కి పాల్పడిన యూనిక్ ఎస్ ఎంసీఎస్ కంపెనీ ప్రధాన ని ర్వాహకుడు కొణతాల చంద్ర శేఖర్ ను జైనథ్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషి యల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై నథ్ మండ లం బెల్గాం గ్రామా నికి చెందిన దండేకర్ ఆనంద్ రావు ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.70/ 2026, సెక్షన్ 318(4) బీ ఎన్ ఎస్, తెలంగాణ స్టేట్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం సెక్షన్-5 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. దర్యాప్తులో యూనిక్ ఎస్ఎంసీఎస్ కంపెనీ పేరుతో ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి పదేళ్లపాటు డిపాజిట్లు సేకరించి, గడువు ముగిసిన తర్వాత రెట్టింపు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి మోసాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఏజెంట్లు సత్యనారాయణ, బొజ్జ గంగారాం ద్వారా జిల్లాలో డిపాజిట్లు సేకరించగా, హైదరాబాద్ నల్లకుంటకు చెందిన కొణతాల చంద్రశే ఖర్ తెలంగాణ రాష్ట్రంలో కంపెనీ కార్యక లాపాలను నిర్వ హిస్తున్నట్లు విచారణలో తే లిందన్నారు. శనివారం ప్రధాన నిందితుడు కొణతాల చంద్రశే ఖర్‌ను అరెస్టు చేసి అతని వ ద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని న్యాయ స్థానం ఎదుట హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపా రు. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటివరకుయూ నిక్ ఎస్ఎంసీఎస్ కంపె నీపై మొత్తం 6 కేసులు నమోద య్యాయి. ఈ కేసుల్లో 40 మంది బాధితులు గుర్తించబడగా, సుమారు రూ.19 లక్షల మేర ప్రజలు పెట్టుబడులు పెట్టి మోసపోయినట్లు దర్యాప్తులో వెల్లడైందని అన్నారు

**జిల్లాలో నమోదైన కేసులు**

నేరడిగొండ పీఎస్-- క్రైం నెం.154/2025 (15 మంది బాధితులు) నేరడిగొండ పీఎస్ -- క్రైంనెం.155/2025 (20 మంది బాధితులు) ఆది లాబాద్ రూరల్ పీఎస్ -- క్రైం నెం.241/2025 (2 మంది బాధితులు),ఆదిలాబాద్ టూ టౌన్ పీఎస్ -- క్రైం నెం.261/ 2025 (1 బాధితుడు) ఆదిలాబాద్ టూటౌన్ పీఎస్ -- క్రైం నెం.263/ 2026 (1 బాధితుడు)జైనథ్ పీఎస్ -- క్రైం నెం.70/2026 (1 బాధితు డు),అధిక లాభాలు, డబుల్ రిటర్న్స్, ఆకర్షణీయ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు సేకరించే సంస్థలను గుడ్డిగాన మ్మవద్దని, పెట్టుబడులు పెట్టే ముందు సంబంధిత సంస్థలకు ప్రభుత్వ అనుమ తులు, చట్ట బద్ధ గుర్తింపు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ప్రజలకు సూచించారు. అనుమానాస్పద ఆర్థిక సంస్థలపై వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఇతనిచే మోస పోయిన వారు దగ్గరలో ఉన్న జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ జి శ్రావణ్,ఎస్ఐ పి గౌతమ్, సిబ్బంది తదితరులు పా ల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై తహసిల్దార్ కు వినతి పత్రం



**సోనాల, జులై 4 ( ప్రజాజ్యోతి ):**విద్యారంగ సమస్యలపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోనాల మండల తహసీల్దార్ కు మెమోరాండం సమర్పించిన టి పి యు ఎస్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు..విద్యారంగ ,ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పి ఆర్ సి ,6 డి ఎ లు ,పెండింగ్ బిల్స్ పూర్తిగా ఎస్ ఎస్ ఏ ,కేజీబీవీ సిబ్బంది సమ్మె కాలపు జీతం చెల్లిస్తూ ఎం టి ఎస్ అమలు చేయాలని సిపిఎస్ రద్దు ,ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులు చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ హెల్త్ కార్డుల విషయంలో అన్ని ఉద్యోగ సంఘాలకు ట్రస్ట్ లో అవకాశం కలిగిస్తూ మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని, జరుగుతున్న ఈ హెచ్ ఎస్ లో ఉన్న వివిధ రకాల ఇబ్బందులను పరిష్కారం చేయాలని.. సోనాల మండల తహసీల్దార్ మల్లేష్ గారికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సోనాల మండల అధ్యక్షులు సెర్పూర్ శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి రాథోడ్ మనోజ్ కుమార్ వినతిపత్రం సమర్పించడం జరిగింది.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-- తహసీల్దార్‌కు టీపీయూఎస్ వినతిపత్రం**



**నేరడిగొండ, జులై 04 (ప్రజాజ్యోతి):**తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం నేరడిగొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాల్సిన ఈ వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేస్తూ, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే:**

ఎనిమిదో పీఆర్సీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి.పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ( ఓ పి ఎస్ ) పునరుద్ధరించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవసరమైన కనీస మౌలిక వసతులను కల్పించాలి. బోధనేతర పనులను తగ్గించి, ఉపాధ్యాయులపై ఉన్న అదనపు పనిభారాన్ని తొలగించాలి "ప్రభుత్వం ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా స్పందించి, తక్షణమే పరిష్కరించాలి.ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ మండల ప్రధాన కార్యదర్శి జాధవ్ రాజునాయక్, అసోసియేట్ అధ్యక్షుడు వి. రాజేశ్వర్, సంఘం ప్రతినిధులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

# కొమురం భీం జిల్లాలో రైతు భరోసా జోరు.. రూ.175.23 కోట్లు రైతుల ఖాతాల్లో

**ఆసిఫాబాద్, జులై 4 ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వానాకాలం--2026 సీజన్‌కు సంబంధించి 1,19,979 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.175.23 కోట్ల ఆర్థిక సాయాన్ని నేరుగా జమ చేసింది. దీంతో జిల్లాలో రైతు కుటుంబాలకు సాగు పెట్టుబడికి గణనీయమైన ఊరట లభించింది.పంట సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించడంతో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సకాలంలో సాగు పనులు ప్రారంభిస్తున్నారని జిల్లా పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కావడం వల్ల పూర్తి ప్రయోజనం రైతులకే అందుతోందని తెలిపింది.జిల్లాలోని గిరిజనులు, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసానిస్తోందని, పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకునే పరిస్థితి తగ్గిందని వెల్లడించింది. రైతులకు అందుతున్న ఈ నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తున్నాయని పేర్కొంది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ, రైతుల



సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు భరోసా పథకం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతున్నారని తెలిపారు. రైతు బాగుంటే గ్రామం బాగుంటుందని, గ్రామం అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో ప్రభుత్వం రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 67.44 లక్షల మంది రైతులకు రూ.7,135.77 కోట్ల రైతు భరోసా నిధులు విడుదల కాగా, అందులో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రైతులు కూడా గణనీయంగా లబ్ధి పొందినట్లు జిల్లా పౌర సంబంధాల శాఖ వెల్లడించింది.

# ఉద్యోగుల సమస్యలపై తహసిల్దార్ కు వినతి పత్రం

**సోనాల, జులై 4 ( ప్రజాజ్యోతి ):**విద్యారంగ సమస్యలపై తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోనాల మండల తహసీల్దార్ కు మెమోరాండం సమర్పించిన టి పి యు ఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు..విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పి ఆర్ సి ,6 డి ఎ లు ,పెండింగ్ బిల్స్ పూర్తిగా ఎస్ ఎస్ ఏ ,కేజీబీవీ సిబ్బంది సమ్మె కాలపు జీతం చెల్లిస్తూ ఎం టి ఎస్ అమలు చేయాలని సిపిఎస్ రద్దు ,ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులు చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ హెల్త్ కార్డుల విషయంలో అన్ని ఉద్యోగ సంఘాలకు ట్రస్ట్ లో అవకాశం కలిగిస్తూ మార్గదర్శకాలు వెంటనే విడుదల చేయాలని, జరుగుతున్న ఈ హెచ్ ఎస్ లో ఉన్న వివిధ రకాల ఇబ్బందులను పరిష్కారం చేయాలని.. సోనాల మండల తహసీల్దార్ మల్లేష్ గారికి తెలంగాణ ప్రాంత



ఉపాధ్యాయ సంఘం సోనాల మండల అధ్యక్షులు సెర్పూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ మనోజ్ కుమార్ వినతిపత్రం సమర్పించడం జరిగింది.

# నేటికల్లా 100 శాతం ఓటర్ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ పూర్తి కావాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, జులై 4 (ప్రజా జ్యోతి)**జిల్లాలో ఓటర్ ఎన్యూమరేషన్ ఫారంల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయా బూత్ స్థాయి అధి కారులు, సూపర్ వైజర్ల కు ఎ స్.ఐ.ఆర్. ప్రక్రియపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట అదనపు సిబ్బందిని నియమించుకుని, క్షేత్రస్థాయిలో పనులను వేగ వంతం చేయాలని సూచించారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, గైర్హాజరైన, వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల ప్రత్యేక జాబితాలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మిగి లిపోయిన ఫారాలను మొబైల్ యాప్‌లో ' సరైన కారణాన్ని ఎంపిక చేసి, ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల తనిఖీల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వారీగా గణాంకాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎన్నికల విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ హె చ్చరించారు.ఈ సమావేశంలో ఆర్డీఓ జగదీశ్వర్ రావు, తహ శీల్దార్లు శ్రీనివాస్, వేణు, ఎన్ని కల నాయబ్ తహసీల్దార్ ఇస్తారి, సూపర్ వైజర్లు, బీఎల్ ఓలు, వార్డు ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ప్రజలకు పారదర్శకంగా ప్రభు త్వ సేవలు దిశ సమావేశంలో ఎంపీ గోడం నగేశ్

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవ హరించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవం తం చేసి అర్హులైన ప్రతి లబ్ధి దారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కా రంలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూ చించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గత ఏడాది కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, భౌతిక, ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు. గ్రామీణా భివృద్ధి, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, వ్యవసాయం, ఐటిడిఏ, విద్యుత్, వై ద్య ఆరోగ్యం, విద్య, మహిళా, శిశు సంక్షేమం, ఉద్యానవనం, అటవీ, గిరిజన సంక్షేమం, క్రీడ లు, పౌర సరఫరాలు, బీఎస్ ఎన్ఎల్, జాతీయ రహదారులు, లీడ్ బ్యాంక్ తదితర శా ఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మా ట్లాడుతూ కేంద్ర నిధులతో అమలవుతున్న అభివృద్ధి కా ర్యక్రమాల్లో జాప్యానికి తావు లేకుండా అధికారులు పని చేయాలని సూచించారు. గత సమావేశం అనంతరం పనుల్లో పురోగతి కనిపించిందని, ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో పా రిశుద్ధ్యం, ఆరోగ్య సేవలను మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి జిల్లాలోని సమస్యల ను సమీక్షించి పరిష్కరించాల నితెలిపారు. ప్రతి శాఖ పని తీరును విడివిడిగా సమీక్షించి సమస్యలకు తక్షణ పరిష్కా రాలు చూపాలని, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. ఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్ కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజ నం అందేలా చర్యలు తీసుకో వాలని, అంగన్వాడీ భవనా ల నిర్మాణాలను వేగవంతం చే యాలని సూచించారు. అవ సరమైన ప్రాంతాల్లో బీ ఎస్ ఎన్ ఎల్ సెల్టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రేషన్ బియ్యం పారదర్శకంగా పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మా ట్లాడుతూ, ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని సూచించారు. యూరియా సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూ డడంతో పాటు రైతులకు యూరియా యాప్ వినియో గంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలు ఉన్నచోట పరిష్కారం చూపాలని, నిర్మాణాల్లో నా ణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జాతీయ రహ దారిపై ప్రమాద కర బ్లాక్ స్పా ట్లను గుర్తించి ప్రమాదాలని వారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మా ట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీ ఆర్డీవో రాథోడ్ రవీందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఎంపి, ఎమ్మెల్యేలతో కలిసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొముర య్య అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం 80 వ వర్ధంతిని పురస్కరించు కొని స్థానిక జిల్లా కలెక్టరేట్ స మావేశ మందిరంలో ఆదిలా బాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఆదిలాబాద్, బోథ్ శాసనసభ్యులు పాయల శంకర్, అనిల్ జాదవ్లతో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరి నిర్మూలనకై ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య ఆశయాలు అమూల్యమైనవని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తిని తలుచుకుంటూ, సమాజ అభ్యున్నతికి, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య మహోన్నత వ్యక్తి అని, నాటి దోపిడీ వ్యవస్థపై ఆయన చూపిన ధైర్యం చిర స్మరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఆ యన ఆశయాల సాధనకు పాటుపడాలని కొని యాడా రు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహనీయుల చరిత్రను, త్యా గాలను భావితరాలకు అందిం చేందుకే జయంతి, వర్ధంతి కా ర్యక్రమాలను అధికారికంగా ని ర్వహించుకుంటూ వారిని స్మ రించుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, బిసి సంక్షే మశాఖ అధికారి సోనియా, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్లతో కలిసి ఆయన దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్య తిరేకంగా రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలి చిపోతుందని అన్నారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తి భా వితరాలకు ఆదర్శంగా నిలు స్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ లోనూ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువ లేమని, వారి ఆశయాల సాధనే వా రికి నిజ మైన నివాళి అని ఎమ్మెల్యే అన్నారు.

## పేదలకు సొంతింటి భరోసా.. బంబారలో గృహప్రవేశ వేడుక

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మండల అధ్యక్షుడు నారాయణ**



**వాంకిడి, జూలై 4 (ప్రజా జ్యోతి)** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబార గ్రామానికి చెందిన మోహర్లె తనుబాయి--సంతోష్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గురునులే నారాయణ రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల సాకారమ వుతోందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డికొండ మహేష్, సమేల ఉప సర్పంచ్ నాగభూషణ్, కనర్గాం ఉపసర్పంచ్ జీవన్, శాలికరావు, ప్రకాష్, జాదే ప్రభాకర్తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ను విమర్శించే నైతిక హక్కు నర్సింగ్కు లేదు

**సింగరేణిపై బహిరంగ చర్చకు రావాలి**

**కాంగ్రెస్కు బీఆర్ఎస్ నాయకుల సవాల్**



**మందమర్రి టౌన్ జూలై 4, (ప్రజా జ్యోతి:** మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్ నాయకుడు నర్సింగ్కు లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సింగరేణిలో స్కాములు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వారు విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి, సింగరేణి అంశాలపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కనకం రవి, దాసరి రాజనర్సు మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హయాంలో గణనీయమైన అభివృద్ధి జరిగిందని, ప్రజలకు ఉపయోగపడే అనేక పనులు చేపట్టారని వారు పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఆరోపణలే ఎక్కువగా వినిపిస్తున్నాయని, స్కీములు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. సింగరేణిలో చోటుచేసుకున్న అవకతవకలపై కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధి, సింగరేణి పరిరక్షణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు కూడా ముందుకు రావాలని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పల్లె నరసింహులు. కోడెం శ్రీనివాస్, గొర్రె రాజేంద్రప్రసాద్. దాసరి అనిల్, సురేందర్, మొగురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఉప సర్పంచ్ రమేష్



**ఆసిఫాబాద్ జులై 4 ప్రజా జ్యోతి** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లోని సౌకర్యాలను పరిశీలించేందుకు బెండర గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ రమేష్ శనివారం స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధన చేస్తున్న తీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, పుస్తకాల పంపిణీ తదితర అంశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్న ఉప సర్పంచ్ రమేష్, వాటి పరిష్కారానికి గ్రామపంచాయతీ నుండి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులకు పాఠశాలకు రోజూ సకాలంలో రావాలని, క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళలు సాధికారత వైపు అడుగులు వేయాలి

ఏ. శ్రీనివాస్ రెడ్డి.



**మందమర్రి, జూలై 04 ( ప్రజాజ్యోతి ):** మహిళలు విద్యతో పాటు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా ఎదగాలని వయోజన విద్యాశాఖ రాష్ట్ర సంచాలకులు ఏ. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వయోజన విద్యాశాఖ జిల్లా ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి సహకారంతో 100 రోజుల కుట్టు శిక్షణ పూర్తిచేసుకున్న శిక్షణార్థులకు శనివారం స్థానిక సీఎఈఆర్ క్లబ్‌లో పరీక్ష నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఏ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మహిళలు ఓపెన్ 10వ తరగతి, ఓపెన్ ఇంటర్, ఓపెన్ డిగ్రీ ద్వారా విద్యను కొనసాగించాలని, చదువుకున్న మహిళలు నిరక్షరాస్యులకు విద్య బోధించి అక్షరాస్యత పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు.వయోజన విద్యాశాఖ నిజామాబాద్ జిల్లా డైరెక్టర్ పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, అధికారుల సహకారంతో శిక్షణ కేంద్రాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.మంచిర్యాల ప్రాజెక్టు అధికారి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమానికి సఖి క్లబ్ అడ్మినిస్ట్రేటర్, డీఆర్పీ బండ శాంకరి, సుమన్ అధ్యక్షత వహించగా, కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ఆర్గనైజర్ ఉప్పులేటి నరేష్, శిక్షకురాలు ఉప్పులేటి శారద తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

**ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి**

**ఏపీకే ఫైల్స్, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, లోన్, సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, ఓ ఎల్ ఎక్స్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**ఈ వారం జిల్లాలో 9 సైబర్ ఫిర్యాదులు నమోదు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండా లని జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్, ఐపీఎస్ సూచించారు. జిల్లాలో నమోదవుతున్న సైబర్ నేరాల స్వభావాన్ని పరిశీలిస్తే, సైబర్ నేరగాళ్లు ప్రతిరోజూ కొత్త పద్ధతులతో అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బ్యాంకు అధికారులు, క్రెడిట్ కార్డు విభాగం,లోన్ సంస్థలు లేదా ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి ఆధార్, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దని సూచించారు. అధికారిక నంబర్లు, వెబ్‌సైట్ల ద్వారా మా త్రమే సమాచారాన్ని ధృవీకరించుకోవాలని తెలిపారు. ఇటీవల జిల్లాలో సోషల్ మీడియా వేదికలైన ఇన్‌స్టాగ్రామ్ లో నకిలీ ఖాతాలు సృష్టించి యువతను బ్లాక్‌మెయిల్ చేయడం, ముద్రలోన్ పేరుతో ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేయడం, క్యూఆర్ కోడ్‌లు పంపించి నగదు కాజేయడం, ఓఎల్ఎక్స్‌లో కొనుగోలు, విక్రయాల పేరుతో మోసాలు, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి క్రెడిట్ కార్డు, కేవైసీ, ఆధార్ వివరాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు దోచుకునే ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు. అలాగే అనుమతి లేకుండానే బ్యాంకు ఖాతాల్లో లావాదేవీలు జరగడం, సోషల్ మీడియా ప్రకటనల ద్వారా గిఫ్ట్ హ్యాంపర్లు, బహుమతుల పేరుతో డబ్బులు వసూలు చేసి అనంతరం ఖాతాలను బ్లాక్ చేయడం, రుణాల పేరుతో నకిలీ రికవరీ ఏజెంట్లు కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి వేధింపులకు పాల్పడడం వంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వారం జిల్లాలో మొత్తం 9 సైబర్ ఫిర్యాదులు నమోద య్యాయని, వాటిలో సోషల్ మీడియా బ్లాక్‌మెయిల్, లోన్ ఫ్రాడ్, క్యూఆర్ కోడ్ మోసా లు, క్రెడిట్ కార్డు ఇంపర్సనేష న్, ఓఎల్ఎక్స్ మోసాలు వంటి వివిధ రకాల కేసులు ఉన్నాయని జిల్లా ఎస్పీ తెలిపారు. నమోదైన ప్రతి ఫిర్యాదుపై సైబర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. "గోల్డెన్ అవర్"లో ఫిర్యాదు చే స్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

**జిల్లాలో నమోదైన సైబర్ ఫిర్యాదులు వివరాలు**

ఇన్‌స్టాగ్రామ్ ఫేక్ అకౌంట్ -- సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రా మ్‌లో నకిలీ ఖాతా సృష్టించి యువకుడి పేరుతో అసత్య ప్రచారం చేస్తూ, పరువు నష్టం కలిగించే పోస్టులు చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడిన ఘట నపై ఫిర్యాదు నమోదైంది.

**లోన్ ఫ్రాడ్:**

ముద్రలోన్ మంజూరైందని నమ్మబలికి ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర చార్జీల పేరుతో ప లుమార్లు డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఘటన నమోదైంది.

**ఓఎల్ఎక్స్ -- క్యూఆర్ కోడ్ ఫ్రాడ్:**

ఓఎల్ఎక్స్‌లో వస్తువులు విక్రయిస్తున్న బాధితుడికి కొనుగోలు దారునిగా నటించి క్యూఆర్ కోడ్ పంపి, పిన్ న మోదు చేయించి రూ.94,000 నగదు కాజేసిన ఘటన వెలు గుచూసింది.

**ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఇంప ర్సనేషన్ ఫ్రాడ్:**

ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు అధికారు లమంటూ ఫోన్ చేసి, ఆధార్ వివరాలతో అక్రమంగా క్రెడిట్ కార్డు తీసుకున్నారని భయపె ట్టి డబ్బులు చెల్లించాలని ప్రయత్నించిన ఘటనపై ఫిర్యాదు అందింది. ఒకే తరహా మొ బైల్ నంబర్ల నుంచి వరుస కా ల్స్ రావడంతో సైబర్ మోసం గా గుర్తించి విచారణ చేపట్టారు.

# గంజాయి కేసుల్లో ప్రమేయం ఉన్న వారికి చెన్నూర్ పోలీసుల ప్రత్యేక కౌన్సెలింగ్

**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనర్, మంచిర్యాల డీసీపీ ఆదేశాల మేరకు చెన్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి సంబంధిత కేసుల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమంను నిర్వహించారు. చెన్నూర్ పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబం, విద్య, ఉపాధి, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండి, సత్ప్రవర్తనతో సమాజంలో బాధ్యతగల పౌరులుగా జీవించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, చెడు స్నేహాలు, మాదకద్రవ్యాల అలవాట్లకు దూరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు బానిసైనట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరైన వారు ఇకపై



గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనబోమని, మంచి పౌరులుగా జీవిస్తామని పోలీసుల సమక్షంలో హామీ ఇచ్చారు. అదేవిధంగా వారిపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, భవిష్యత్తులో గంజాయి కలిగి ఉన్నా, వినియోగిస్తున్నా లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో పట్టుబడితే అవసరమైతే పీడీ చట్టం కింద కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యంత అవసరమని, గంజాయి విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100, డయల్-112కు తెలియజేయాలని చెన్నూర్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయం వృత్తి మాత్రమే కాదు. వేలాది కుటుంబాల జీవనాధారం.రైతు భరోసాతో జిల్లా రైతుల జీవితాలలో వెలుగులు

**175.23 కోట్ల రూపాయల తో 1 లక్ష 19 వేల 979 మంది రైతు కుటుంబా లకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం:**

**జిల్లాలోని గిరిజన చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసాను కల్పిస్తుంది:**

**రైతుల సంక్షేమమే సంక్షేమ పరమావాదిగా తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంది. జిల్లా కలెక్టర్, కె. హరిత:**



**జూలై 4,సిర్పూర్(టి) కాన్స్టెన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం. అలాంటి రైతు కుటుంబాలకు ప్రతి పంట సీజన్‌లో ఆర్థిక ధైర్యాన్ని అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మరోసారి విజయవంతమైంది. వానాకాలం 2026 సీజన్‌లో జిల్లాలోని 1,19,979 మంది రైతుల ఖాతాల్లో 175. 23 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం నేరుగా జమ కావడంతో రైతు కుటుంబాల లో ఆనందం వెల్లివిరిసింది. ఒకప్పుడు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం నేరుగా పెట్టుబడి సహాయాన్ని అందించడం వల్ల వ్యవసాయ పనులు ఆలస్యం కాకుండా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లో రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు. ఈ పథకం ద్వారా అందుతున్న సహాయంతో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సకాలంలో సాగు పనులు చేపడుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలలో నిధులు జమ కావడం వల్ల రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతోంది.జిల్లాలోని గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసాను కల్పిస్తోంది. పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గి, రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. రైతు భరోసా ద్వారా అందుతున్న నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తూ స్థానిక వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని రైతు భరోసా మరోసారి నిరూపించింది. రైతు శ్రమకు విలువనిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 67.44 లక్షల మంది రైతులకు 7,135.77 కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల కాగా, అందులో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కూడా విశేషంగా లబ్ధి పొందింది. ఈ సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడమే కాకుండా, వానాకాలం సాగును విజయవంతంగా ప్రారంభించేందుకు కీలకంగా మారింది.రైతు భరోసా పథకంపై జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయూత అందిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు రైతు భరోసా పథకం నిలువెత్తు నిదర్శనమని, "రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది – గ్రామం బాగుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతుల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులే ఈ పథకం విజయానికి అసలైన నిదర్శనమని తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న బీజేపీ ప్రభుత్వం

**తీవ్రంగా ఖండించిన కాంగ్రెస్ నాయకులు,**

**న్యాయవాది జావిద్ అలీ ఖాన్**



**జూలై 4, సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజా జ్యోతి:** దేశ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది జావిద్ అలీ ఖాన్ విమర్శించారు.ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి కష్టపడి సిద్ధమవుతున్న విద్యార్థులు పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా తీవ్ర నిరాశకు గురవుతు న్నారని అన్నారు.బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశవ్యాప్తంగా 89 కు పైగా ప్రధాన పరీక్షల పేపర్ లీక్ ఘటనలు వెలుగులోకి రావడం అత్యంత ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ కేసుల్లో ఎంతమందిని అరెస్ట్ చేశారు? ఎంతమంది పై చార్జ్‌షీట్లు దాఖలు చేశారు? ఎంతమందికి కోర్టులు శిక్షలు విధించాయి? ఈ వివరాలను శ్వేతపత్రం రూపంలో దేశ ప్రజలకు వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని జావిద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ వంటి ఘటనలు దేశవ్యాప్తంగా విద్యార్థులు,తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయని, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని అన్నారు. పేపర్ లీక్‌ల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి, వారికి రాజకీయ లేదా అధికార పరమైన రక్షణ కల్పించకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షలకు సంబంధించిన ఒత్తిడి, అనిశ్చితి, వివాదాల నేపథ్యంలో పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్లు వెలువడిన వార్తలు దేశాన్ని కలచివేశాయి. అలాంటి విద్యార్థుల కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం, మానసిక సహాయాన్ని అందించడంతో పాటు, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన సహాయం అందించిందో దేశ ప్రజలకు వెల్లడించాలి అని జావిద్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు.పేపర్ లీక్‌ల వల్ల నిజాయితీగా చదివే లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా వ్యవస్థను పూర్తిగా పారదర్శకంగా,అవినీతి. రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ చేపట్టాలని కోరారు.దేశ యువత. కు భవిష్యత్తుతో చెలగాటం ఆడే పరిస్థితిని ఇకపై సహించబోమని, విద్యార్థులకు న్యాయం చేయడం,పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని న్యాయవాది కాంగ్రెస్ పార్టీ నాయకులు జావిద్ అలీ ఖాన్ పేర్కొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియకు రాజంపేటలో ప్రత్యేక ఏర్పాట్లు



**ఆసిఫాబాద్ జులై 4 ప్రజా జ్యోతి** రాజంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు నమోదు (సర్ ) కార్యక్రమాన్ని శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్సా పోచయ్య, వార్డు సభ్యుల జిల్లా ఫోరం అధ్యక్షుడు గులాం జావీద్, మండల రెవెన్యూ ఆర్ఐ, జీపీఓ, బీఎల్ఓలు శ్రీలక్ష్మి, సునీత, అర్చన, గ్రామపంచాయతీ కార్యదర్శి సాయి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, అలాగే పేరు, చిరునామా, ఇతర వివరాల్లో అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా చేయించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో నవీకరించే లక్ష్యంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## 8 గ్రామాలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు కోరుతూ వినతి



**ఆసిఫాబాద్ జులై 4 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఇందాని ఎక్స్ రోడ్ నుంచి ఇందాని గ్రామానికి 7 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మించి, ఇందాని సహా ఎనిమిది గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) యువరాజ్ మర్మాట్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఇందాని, ఖిరిడి, ఫూల్ జంగావ్, నవేగుడ, తేజిగూడ, తేజాపూర్, మోకాసిగూడ, రెండిగూడ గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టరేట్‌కు చేరుకుని తమ సమస్యలను వివరించారు. ఇందాని ఎక్స్ రోడ్ నుంచి గ్రామానికి బీటీ రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు, రైతులు, గర్భిణీలు, వృద్ధులు అత్యవసర సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ ఎనిమిది గ్రామాల్లో సరైన విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనివల్ల విద్యార్థుల చదువులు, రైతుల వ్యవసాయం, గ్రామాల అభివృద్ధి ప్రభావితమవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. వెంటనే బీటీ రహదారి నిర్మించి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఖిరిడి ఉపసర్పంచ్ కొరంగె సంగార్, నవేగుడ ఉపసర్పంచ్ బెండ్రే మురళీధర్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తి విద్యార్థుల భవిష్యత్తు కోసం చర్యలు తీసుకోవాలి

ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి అంటూ గ్రామ పంచాయతీ పాలకవర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ

గ్రామ పటేల్ గ్రామ పెద్దలు నాలుగో వార్డ్ సభ్యురాల తో కలిసి గ్రామ సర్పంచ్ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలన:బిబి

ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తి, అధికారుల నిర్లక్ష్యం అంటూ గ్రామస్తుల ఆందోళన పిల్లల భవిష్యత్తుపై విద్యాశాఖ వెంటనే స్పందించాలని డిమాండ్:బి

అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు పరిష్కార మార్గాలపై గ్రామస్తుల సూచనలు:

**జులై 4 సిర్పూర్ (టి) కాన్స్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని సరండి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయంటూ గ్రామపంచాయతీ పాలకవర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామ సర్పంచ్, గ్రామ పటేల్ మేంఘుజి,4వవార్డు సభ్యురాలు, గ్రామ పెద్దలు కలిసి పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన తీరు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక వసతులు తదితర అంశాలను పరిశీలించిన అనంతరం ప్రధానోపాధ్యాయుని పనితీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల కథనం ప్రకారం.. గత కొంతకాలంగా పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడం లేదని, దీనివల్ల విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపారు. చిన్నతరగతుల విద్యార్థులకు పునాది విద్య అత్యంత కీలకమని, అలాంటి దశలో సరైన బోధన లేకుంటే భవిష్యత్తులో వారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాల అనేది గ్రామ భవిష్యత్తుకు పునాది అని, అక్కడి విద్యార్థులే రేపటి సమాజ నిర్మాతలని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. అందువల్ల విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని పరిశీలించాలని డిమాండ్ చేశారు. పాఠశాల సందర్శన సందర్భంగా విద్యార్థులతో గ్రామపంచాయతీ ప్రతినిధులు మాట్లాడారు. వారు పాఠాలు ఎలా చెబుతున్నారో, ఉపాధ్యాయులు తరగతులకు సమయానికి వస్తున్నారా, పాఠ్యాంశాలు పూర్తవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కొంతమంది తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై ఆందోళన వ్యక్తం చేస్తూ, పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ బాపూజీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం పెరగాలంటే ముందుగా నాణ్యమైన విద్య అందాలని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ గ్రామస్థాయిలో వాటి ఫలితాలు కనిపించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే పరిస్థితి రావద్దని, అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.గ్రామ పటేల్ మేంఘుజి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సమానంగా పోటీ పడేలా బోధన ఉండాలని అన్నారు. అందుకోసం ఉపాధ్యాయులు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. 4వ వార్డు సభ్యురాలు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఎన్నో ఆశలతో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారని, వారి ఆశలను నిలబెట్టే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయుని పనితీరులో మార్పు రావాలని, లేకపోతే అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా మాట్లాడుతూ..విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైతే మరో ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించాలని విద్యాశాఖ అధికారులను కోరింది. దీంతో విద్యార్థులకు నిరంతర బోధన అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. పాఠశాలపై తమకు నమ్మకం ఉందని, అయితే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఒకటే ప్రధాన విద్యా కేంద్రం కావడంతో దానిని బలోపేతం చేయడం అత్యంత అవసరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి విద్య అందితే గ్రామ అభివృద్ధికి అది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

**పాఠశాల పరిస్థితులు గ్రామస్థుల ఆందోళన, విద్యా వ్యవస్థపై ప్రభావం**

**పిల్లల భవిష్యత్తు కోసం విద్యాశాఖ వెంటనే స్పందించాలని డిమాండ్**

సరండి గ్రామ ప్రాథమిక పాఠశాలపై గ్రామపంచాయతీ పాలకవర్గం వ్యక్తం చేసిన అసంతృప్తి కేవలం ఒక ఉపాధ్యాయుడి పనితీరుకు మాత్రమే పరిమితం కాలేదని, గ్రామంలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కావాలనే ఆకాంక్షతోనే ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు విద్యను అందించే ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయని, అలాంటి పాఠశాలల్లో నాణ్యమైన బోధన లేకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వస్తున్నప్పటికీ, వారికి అవసరమైన స్థాయిలో బోధన అందడం లేదని పలువురు తల్లిదండ్రులు పేర్కొన్నారు. చదువులో వెనుకబడుతున్న పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి అదనపు తరగతులు నిర్వహించడం, ప్రాథమిక స్థాయిలో చదవడం, రాయడం, గణితం వంటి నైపుణ్యాలను పెంపొందించడం వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

గ్రామపంచాయతీ ప్రతినిధులు పాఠశాలను సందర్శించిన సందర్భంగా తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు స్థాయిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతమంది పిల్లలు పాఠ్యాంశాలను సరిగా అర్థం చేసుకోలేకపోతున్నట్లు గమనించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఇతర సంక్షేమ పథకాలు అందిస్తున్నప్పటికీ, నాణ్యమైన బోధన లేకపోతే వాటి ప్రయోజనం పూర్తిగా అందదని అన్నారు. పిల్లలకు మంచి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమైతే, ఉపాధ్యాయుల పనితీరును కూడా క్రమం తప్పకుండా సమీక్షించాలని కోరారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. మా గ్రామంలోని ప్రతి విద్యార్థి మంచి చదువు నేర్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మా ఆకాంక్ష. అందుకే పాఠశాల పరిస్థితిని పరిశీలించాం. ఇది వ్యక్తిగత విమర్శ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తీసుకున్న బాధ్యతాయుతమైన చర్య అని పేర్కొన్నారు. గ్రామ పటేల్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి. ప్రతి ఉపాధ్యాయుడు సమయపాలనతో, అంకితభావంతో పనిచేయాలి. విద్యార్థుల అభ్యాస ఫలితాలే పాఠశాల పనితీరుకు ప్రమాణం కావాలి అని అన్నారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. అవసరమైతే మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుని పనితీరుపై వచ్చిన అభ్యంతరాలను నిష్పాక్షికంగా విచారించి, విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే అదనపు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాలని, అవసరమైన బోధనా సామగ్రిని అందించాలని, విద్యార్థుల అభ్యాస స్థాయిని నెలనెలా అంచనా వేసే విధానం అమలు చేయాలని గ్రామస్థులు సూచించారు. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రాథమిక దశలో విద్యార్థులకు సరైన పునాది వేయడం అత్యంత కీలకం. ఈ దశలో బోధనలో లోపాలు ఉంటే, ఉన్నత తరగతుల్లో కూడా వారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. అందువల్ల ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు, పర్యవేక్షణ వ్యవస్థ, తల్లిదండ్రులతో నిరంతర సమావేశాలు నిర్వహించడం అవసరమని సూచిస్తున్నారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందాలి. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చెందాలి. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి.

**అధికారుల నిర్లక్ష్యమా? -- గ్రామస్థుల ప్రశ్నలు, విద్యాశాఖ స్పందన కోసం ఎదురుచూపులు**

సరండి గ్రామ ప్రాథమిక పాఠశాలపై గ్రామపంచాయతీ ప్రతినిధులు వ్యక్తం చేసిన అసంతృప్తి నేపథ్యంలో ఇప్పుడు గ్రామస్థులు విద్యాశాఖ అధికారుల వైఖరిపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేకపోతే సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నారా? విద్యార్థుల అభ్యాస ఫలితాలను సమీక్షిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థుల కథనం ప్రకారం, ప్రభుత్వ పాఠశాలలపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహిస్తే ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. పాఠశాల సందర్శనలు కేవలం రికార్డుల పరిశీలనకే పరిమితం కాకుండా, తరగతి గదుల్లో బోధన, విద్యార్థుల అభ్యాస స్థాయి, హాజరు, పాఠ్య ప్రణాళిక అమలు వంటి అంశాలను కూడా పరిశీలించాలని వారు కోరుతున్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నందున నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పిల్లలు చదువులో వెనుకబడితే వారి భవిష్యత్తుపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే విద్యాశాఖ అధికారులు సమస్యను సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ సభ్యులు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధి విషయంలో గ్రామపంచాయతీ, పాఠశాల నిర్వహణ కమిటీ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు అందరూ కలిసి ముందుకు రావాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, వెనుకబడిన విద్యార్థులకు అదనపు బోధన అందించాలని, నెలవారీగా పురోగతి నివేదికలు సిద్ధం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే ప్రతి నెల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతిపై చర్చించాలని సూచిస్తున్నారు.

# చెత్త కుప్పల మధ్య వీరాంజనేయుని ఆలయ పవిత్రత..!

## దేవుడిపై భక్తి ఉన్నా.. దేవాలయ పరిశుభ్రతపై నిర్లక్ష్యం ఎందుకు..?

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని భక్తుల విజ్ఞప్తి

**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** ఆపదలో ఆదుకునే దేవుడు... కష్టాల్లో ధైర్యం ఇచ్చే దైవం... భక్తుల కోరికలు తీర్చే ఆరాధ్యుడు... దుష్టశక్తుల నుంచి కాపాడే పరమదైవంగా భక్తులు విశ్వసించే శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ప్రస్తుతం చెత్త కుప్పల మధ్య తన పవిత్రతను కోల్పోతున్న పరిస్థితి కనిపిస్తోంది. భక్తి, ఆధ్యాత్మికత, దైవ చింతనకు ప్రతీకగా నిలవాల్సిన ఆలయం చుట్టూ రోజురోజుకూ పేరుకుపోతున్న చెత్తాచెదారం భక్తులను తీవ్రంగా కలచివేస్తోంది. మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో జాతీయ రహదారి అయిన మంచిర్యాల--గోదావరిఖని రహదారి పక్కనే ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి ప్రతిరోజు వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా మంగళవారం, శనివారం రోజులతో పాటు పండుగలు, పబ్బాలు, వివాహాలు, పుట్టినరోజులు, పెళ్లిరోజుల సందర్భంగా, అలాగే స్వామి మాలలు ధరించి దీక్షలు చేపట్టే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శిస్తుంటారు. అయితే ఆలయం పక్కనే, గోడకు ఆనుకొని కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ప్రతిరోజు చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను పడేయడం వల్ల ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఆలయంలో పూజలు, అభిషేకాలు, ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతుంటే, మరోవైపు ఆలయం బయట చెత్త కుప్పలు దర్శనమివ్వడం ,దుర్గంధ పూరితమైన వాసనలు రావడం విచారకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**హెచ్చరిక బోర్డు ఉన్నా ఆచరణలో శూన్యం........!**

ఈ ప్రదేశంలో చెత్త వేయడం, ప్లాస్టిక్ వాడకం, కొనుగోలు, అమ్మకాలను నిషేధిస్తూ మంచిర్యాల నగరపాలక సంస్థ ఇప్పటికే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.500 నుంచి రూ.5000 వరకు జరిమానా విధిస్తామని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అయినప్పటికీ అక్కడ పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు, ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, స్థానిక నాయకులు ప్రతిరోజూ ఇదే




మార్గంలో సంచరిస్తూ ఆలయంలోకి వెళ్లి పూజలు నిర్వహించి వెళుతున్నప్పటికీ ఆలయం చుట్టూ నెలకొన్న అపరిశుభ్రతపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమని భక్తులు అంటున్నారు.

**పవిత్రతను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి........!!**

ఈ విషయాన్ని ఇటీవల కొంతమంది భక్తులు సంబంధిత మున్సిపల్ కమీషనర్ , వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై స్పందించిన కార్పొరేటర్, అక్కడ ఎవరైనా చెత్త వేస్తున్నట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిసింది. అయినా అక్కడి పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు .షరా మామూలే. ఇప్పటికైనా మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్, నగరపాలక సంస్థ కమిషనర్, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, చెత్త వేస్తున్న వారిని గుర్తించి భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. దేవుడిపై భక్తి అనేది కేవలం కొబ్బరికాయ కొట్టడం, పూజలు చేయడం మాత్రమే కాదని... దేవాలయ పవిత్రతను కాపాడుకోవడం కూడా ప్రతి భక్తుడి బాధ్యతేనని పలువురు పేర్కొంటున్నారు. భక్తుల విశ్వాసానికి నిలయంగా ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం తన పవిత్రతను నిలుపుకోవాలంటే ప్రజలు, అధికారులు, భక్తులు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టమవుతోంది.

# సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**ముఖ్య కార్యదర్శి హరిచందన ఐఏఎస్‌కు మెమోరాండం సమర్పించిన సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్**

**జూలై 4 సిర్పూర్ (టి) కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి: హైదరాబాద్, జూలై 4:**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కోరుతూ, రాష్ట్ర ముఖ్య కార్యదర్శి హరిచందన (ఐఏఎస్) కు సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు జె. మల్లికార్జున్ మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా జె. మల్లికార్జున్ మాట్లాడుతూ, 2018 ఆగస్టు నుండి జెకె పేపర్ లిమిటెడ్ యాజమాన్యం సిర్పూర్ పేపర్ మిల్లును టేకోవర్ చేసినప్పటి నుండి సుమారు ఏడు సంవత్సరాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 373 మంది పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు కలిపి సుమారు 2,168 మంది పనిచేస్తున్నారని చెప్పారు.ఇంత పెద్ద పరిశ్రమలో ఇప్పటికీ గుర్తింపు కార్మిక సంఘం లేకపోవడంతో వేతన ఒప్పందాలు, కార్మికుల సమస్యలు, సంక్షేమ అంశాలు పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అన్ని కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశ్రమ ప్రధాన గేటు వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయని తెలిపారు.గుర్తింపు ఎన్నికలను నిర్వహించకుండా పేపర్ మిల్ యాజమాన్యం అడ్డంకులు సృష్టిస్తోందని, హైకోర్టులో రిట్ పిటిషన్ నెం. 3966/2026 దాఖలు చేసి, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్--2020 సెక్షన్ 14(1) నుంచి (4) ప్రకారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు గుర్తింపు ఎన్నికలు నిర్వహించే అధికారం లేదని వాదిస్తోందని పేర్కొన్నారు.అదే సమయంలో రాష్ట్రంలో కొత్త లేబర్ కోడ్‌లు ఇంకా అమల్లోకి రాలేదని, అనేక పరిశ్రమల్లో పాత చట్టాల ప్రకారమే గుర్తింపు ఎన్నికలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. సిర్పూర్ పేపర్ మిల్లులో కూడా అదే విధానాన్ని అనుసరించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు.అన్ని కార్మిక సంఘాలు ఏకగ్రీవంగా గుర్తింపు ఎన్నికలు జరపాలని కోరుతున్నప్పటికీ యాజమాన్యం సహకరించడంలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, ప్రభుత్వ తరపు న్యాయపరమైన చర్యలు చేపట్టి, ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకులను తొలగించి, సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్య కార్యదర్శిని విజ్ఞప్తి చేశారు.





# భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహిస్తున్న మీడియా నిర్వహణ

**ప్రజా కమ్యూనికేషన్ ఎన్నికల సమాచార ప్రచారంపై సాంకేతిక సెషన్లలో పాల్గొన్న అధికారుల జాతీయ సదస్సులో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్:**



**జూలై 4, సిర్పూర్ (టి) కాన్స్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీ ఆర్ఓ) సంపత్ కుమార్ ఢిల్లీలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మీడియా కమ్యూనికేషన్ అధికారుల సదస్సులో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్మెంట్ ఐఐఐడిఈయంలో ఈ సదస్సులో మీడియా నిర్వహణ, ప్రజా కమ్యూనికేషన్, ఎన్నికల సమాచార ప్రచారం ఫేక్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా వినియోగంపై సాంకేతిక సెషన్లు నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన అధికారులతో కలిసి పాల్గొన్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికారిగా ఎంపిక కావడంపై జిల్లా అధికార యంత్రాంగం, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సమర్థవంతంగా బి ఎల్ ఓ బి ఎల్ ఏ లు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పూర్తి చేయాలి

**ఖానాపూర్ జూనియర్ కళాశాలలో బి ఎల్ ఎ -2లకు అవగాహన శిక్షణ కార్యక్రమం**



**ఖానాపూర్, జూలై 4:( ప్రజా జ్యోతి)** ఖానా పూర్లో ప్రత్యేక ఓటరు జాబితా (సర్) కార్యక్ర మాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు స్థానిక తహసీల్దార్ సుజాతరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల లోని డిజిటల్ క్లాస్‌రూమ్‌లో బి ఎల్ ఎ -2లకు అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో శిక్షకులు వినోద్ ప్రత్యేక ఓటరు జాబితా (సర్ ) ప్రక్రియ, వివిధ ఫారాల నింపే విధానం, బి ఎల్ ఎ -2ల బాధ్యతలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఓటరు వివరాల పరిశీలన తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న వారి సందేహాలను నివృత్తి చేస్తూ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ పట్టణ బిఎల్వోలు,బి ఎల్ ఎ -2ల సూపర్‌వైజర్లు షబ్బీర్ పాషా, ద్యావతి రాజేశ్వర్, దాసరి రాజన్న, ఆమెర్ సంతోష్ గౌడ్ నసీర్ ఇర్ఫాన్ తో పాటు పాటు బిజెపి బిఆర్ఎస్ ఎంఐఎం పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లు పాల్గొని శిక్షణ పొందారు శిక్షణ అనంతరం తమ పరిధిలోని ఓటర్లకు సరైన అవగాహన కల్పిస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రత్యేక ఓటరు జాబితా (సర్ ) కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బి ఎల్ ఓ లు లు ఎదుర్కొంటున్న సందేహాలను గుర్తించి, సత్వరంగా వాళ్లకు సమగ్ర శిక్షణ అందించేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తాసిల్దార్ మంజులను రాజకీయ పార్టీల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ.నగేష్ సర్వేయర్ కిషన్ సూపరిండెంట్ సవిత జ్యోతిక వరలక్ష్మి చంద్రాణి కవిత రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## నిర్మాణంలో ఉన్న ఆర్ ఓ బి, ఆర్ యు బి పనులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి పరిశీలించిన ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ టౌన్, జూలై 4 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓ బి), ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్ యు బి) పనులను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం పరి శీలించారు. ఆర్ అండ్ బి ప్రధాన ఇంజనీర్ (సీఈ) వనజ, ఇతర స్థానిక అధికారులతో కలిసి వారు పనుల పురోగతి ని సమీక్షించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా పనుల పురోగతికి కొంత అంతరాయం ఏర్పడిందని, వర్షాలు తగ్గిన వెంటనే పనులను మరింత వేగంగా కొనసాగిస్తామని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వ త పరిష్కారం లభించడంతో పాటు ప్రజల రాకపోకలతో పాటు మార్కెట్ యార్డుకు వచ్చే రైతుల కు మరింత సులభతరం అవుతాయని నాయకులు తెలిపారు.

## సీనియర్ వ్యాపారవేత్త బజ రంగ్ లాల్ అగ్రవాల్ ను పరా మర్శించిన ఏఎంసీ చైర్మన్ శ్రీ కాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ టౌన్, జూలై 4 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంకు చెందిన సీనియర్, ప్రముఖ వ్యా పారవేత్త బజరంగ్ లాల్ అగ్ర వాల్ గతవారం అనారోగ్యా నికి గురై హైదరాబాద్ గచ్చి బౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నా రు. ఈ విషయం తెలుసుకు న్న ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం కాంగ్రెస్ నాయకులు దుర్గం శేఖర్‌తో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తె లుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమ స్వగృహానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డి ని బజరంగ్ లాల్ కుమారుడు, యువ వ్యాపారవేత్త ప్రతీక్ అగ్రవాల్, పరమాత్మ, నర్సింగ్ దాస్, జీన్నింగ్, ప్రెసింగ్ ఫ్యాక్టరీ యాజ మానులు రాదేశ్యం అగర్వాల్, వినోద్ అగ్రవాల్, రాజేష్ అగ్రవాల్, మనీష్ అగ్రవాల్, నిఖిల్ అగ్రవాల్, ప్రవీణ్ చతుర్వేది తదితరులు పూలగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అంతకు ముందు దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, కైలాస్ నగర్ లోని తన నివాసంలో బోరంచు శ్రీకాంత్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు దామోదర్ రెడ్డితో కలిసి సన్మానించారు. కార్యక్రమాల్లో రేండ్ల రాజన్న, కొత్తపెల్లి అడెల్లు తదితరులు ఉన్నారు.

## శిథిలమైన స్కూల్ భవనాలను సందర్శించిన ఆర్డీవో దేవిదాస్

కొత్త భవనాల నిర్మాణాలకు కలెక్టర్కు నివేదిస్తాం



**ఖానాపూర్ జూలై 4( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ పట్టణంలో గల 5వ వార్డులోని పాత బస్టాండ్ ఎంపీపీ స్కూల్, రెండవ వార్డ్ శాంతినగర్ లోని ప్రాథమిక పాఠశాలల శిథిలమైన భవనాలను మున్సిపల్ ప్రత్యేక అధికారి ఆర్డీవో దేవదాస్ శనివారం సందర్శించి భవనాల తీరును పరిశీలించారు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించే విధంగా అర్ధాంతరంగా కూలిపోయే పరిస్థితిలో ఉన్న భవనాలు తొలగించాలని ఆదేశించారు కొత్త భవనాల నిర్మాణానికి జిల్లా కలెక్టర్కు నివేదికలు పంపి త్వరలో మంజూరు కి కృషి చేస్తామన్నారు కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకం మౌనిక మహేందర్ ఐదో వార్డ్ కౌన్సిలర్ మేష పోసాని తనయుడు సతీష్ ఎమ్మార్వో సుజాత రెడ్డి ఎంపీడీవో రాథోడ్ రాధా తదితరులు పాల్గొన్నారు

## రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న రేషన్ డీలర్ ప ట్టివేత

**రేషన్ కార్డు, బయోమెట్రిక్ ధ్రు వీకరణ లేకుండానే బియ్యం విక్రయం**

**80 కిలోల పీడీఎస్ బియ్యం, మొబైల్ ఫోన్, స్టాక్ రికార్డులు స్వాధీనం**

**వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి. సునీ ల్ కుమార్**




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 4 (ప్రజా జ్యోతి)** ప్రభుత్వం పేదల కోసం అంది స్తున్న ప్రజా పంపిణీ రాయితీ (పిడిఎస్) బియ్యాన్ని అక్ర మంగా విక్రయిస్తున్న రేషన్ డీలర్‌ను వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బి. సునీల్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమా చారం మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఆదిలాబాద్ పట్టణా నికి చెందిన రేషన్ డీలర్ సునీల్ కుమార్ జెన్నవర్ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ రేషన్ కార్డు లేని వ్యక్తులకు బయోమెట్రిక్ ధ్రువీకరణ లేకుండానే పీడీఎస్ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా బడ్కా మొహల్లాకు చెందిన అబ్దుల్ ఖయ్యూం అనే వ్యక్తికి రేషన్ బియ్యాన్ని విక్రయి స్తుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు తమ తప్పును అంగీకరించినట్లు తెలిపారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి 80 కిలోల పీడీఎస్ రేషన్ బియ్యం, అక్రమ కార్యక లాపాలకు ఉపయోగించిన నార్జో 70ఎక్స్ 5జీ మొబైల్ ఫోన్, సంబంధిత స్టాక్ రికార్డులు, రసీదులను స్వాధీనం చే సుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని, రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలియ జేయాలని వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బి. సునీల్ కుమార్ ప్రజలకు విజ్ఞ ప్తి చేశారు.

## సుర్దాపూర్‌లో నూతన బోర్‌వెల్ ఏర్పాటు.. సర్పంచ్, ఉపసర్పంచ్ కార్యదర్శిలకు గ్రామస్తులు సన్మానం



**కెరమెరి, జూలై 4 (ప్రజా జ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సుర్దాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో నూతన బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ ఆధ్వర్యంలో నూతన బోర్‌వెల్ ఏర్పాటు చేయడంతో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు కొంతవరకు తొలగాయి.గ్రామ ప్రజల సమస్యను వెంటనే గుర్తించి పరిష్కారం చూపినందుకు సర్పంచ్, ఉపసర్పంచ్ కర్యదర్శిలను గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాదభాయి ఉప సర్పంచ్ సాగర్ కార్యదర్శి నానేశ్వర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆధునిక సాగు పద్ధతులతో రైతుకు అధిక దిగుబడి



**సోనాల జులై 4 ప్రజా జ్యోతి** సోనాల మండల కేంద్రం లోని రైతువేదికలో కాటన్ ప్రొడక్టివిటి – కపాస్ క్రాంతి కార్యక్రమం లో భాగంగా రైతులకు ఉచిత సబ్సిడీ విత్తనాలను బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ పంపిణీ చేసారు.ఆయన మాట్లాడుతూ రైతులు ఆధునిక సాగు పద్ధతులు పాటించడం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గి అధిక లాభాలు పొందొచ్చని,అధిక సాంద్రత పద్ధతి అనుసరించడం ద్వారా తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ దిగుబడి సాధించే అవకాశం ఉందని,రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మంచి పంట దిగుబడులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, మార్కెట్ డైరెక్టర్ జంగాల బోజన్న,సుదర్శన్,రైతులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్బతి అంజనేయ స్వామి ఆలయంలో సీఎం రేవంత్ ప్రత్యేక పూజలు

**నాగర్ కర్నూలు :** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం నాగర్కర్నూల్ జిల్లా ఉరుకొండపేట శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10 కోట్ల రూపాయలతో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఉరుకొండపేట గ్రామంలో కోలాహలం నెలకొంది. రాజకీయ ప్రస్థానంలో జెడ్పీటీసీగా ఎన్నికైన 20 ఏళ్ల నాటి మరిచిపోలేని అనుభూతితో గ్రామంలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి కి ఆత్మీయులు, ఆనాటి పెద్దలు ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆనాటి సహచరులతో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి:

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్** : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బహుముఖ ప్రజ్ఞాశాలి ఆర్థిక వ్యవహారాల్లో అపార అనుభవం కలిగిన స్వర్గీయ కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆ మహనీయుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన ప్రజాసేవలు, రాజకీయ జీవితం, పరిపాలనా దక్షతను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. కొణిజేటి రోశయ్య నిరాడంబర జీవనశైలితో, నిజాయితీతో ప్రజలకు సేవలు అందించి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రిగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమర్థంగా నిర్వహించిన ఆయన, ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమం, పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. రాజకీయాల్లో విలువలు, క్రమశిక్షణ, నిబద్ధతకు ఆయన నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొని రోశయ్యకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో స్వామి ఆర్డీవోలు షర్మిల, జల కుమారి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, డీవైఎస్ఓ శ్రీనివాస్ గౌడ్ ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు కన్న కృష్ణ, మునీందర్ ఆర్యవైశ్య సంఘాల నాయకులు పలువురు అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్పార్స్ 2026 భేటీలో పాల్గొన్న కేటీఆర్

**హైదరాబాద్** : ఫిల్మ్ నగర్లోని ఏజీఅ కన్వెన్షన్లో జరిగిన 'స్పార్స్ - 2026' వార్షిక సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజ సేవకు అంకితమైన 'టచ్ ఏ లైఫ్' (నీబీఇష్ట్ర జీ ఒతిటవ) థీమ్తో సాగుతున్న ఈ సంస్థ, మహిళల విద్య, స్కిల్ డెవలప్మెంట్ మరియు ఉపాధి అవకాశాల కల్పన ద్వారా వేలాది కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని ఈ సందర్భంగా కొనియాడారు.

ఈ సమావేశంలో కేటీఆర్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. తన 50వ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆర్థికంగా వెనుకబడిన 50 మంది యువతుల చదువు మరియు సాధికారత బాధ్యతను స్వీకరించారు. ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎవరైనా అవసరంలో ఉన్నప్పుడు సహాయం చేయడం మానవత్వమని, భవిష్యత్తులో ప్రభుత్వ పరంగా కూడా ఇలాంటి సత్కార్యాలకు పూర్తి సహకారం అందిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతే లక్ష్యంగా ౹ాఖంఖీంం సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు

## భయం వీడండి... ఫిర్యాదు చేయండి...

**మహిళల భద్రతకు అండగా రామగుండం షీ టీమ్స్:**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, మహిళలు,బాలికల భద్రతకు భరోసాగా రామగుండం షీ టీమ్స్ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు,బాలికల భద్రత కోసం షీ టీమ్స్ నిరంతరం సేవలందిస్తున్నాయని పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖపై, షీ టీమ్స్పై విశ్వాసం, భరోసాతో మహిళలు, బాలికలు తమపై జరుగుతున్న వేధింపుల గురించి ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి జోన్లో ఒక షీ టీమ్, మంచిర్యాల జోన్లో రెండు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు.మహిళలు, బాలికలు, చిన్నారులను ఎవరైనా వేధించినా వెంటనే షీ టీమ్స్కు సమాచారం అందించాలని సూచించారు.షీ టీమ్ వాట్సాప్ నంబర్: 6303923700పెద్దపల్లి జోన్ షీ టీమ్: 8712659386

# 2025--26కు సీఎంపీఎఫ్పై 7.7% వడ్డీ ఖరారు

**పీఎఫ్, పెన్షన్ సంస్కరణలపై కీలక నిర్ణయాలు**

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు**



**మంచిర్యాల, 4,జూలై (ప్రజాజ్యోతి):** కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్ఓ) 186వ బోర్డ్ ఆఫ్ ట్రస్టీల (బీఓటీ) సమావేశంలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సీఎంపీఎఫ్పై 7.7 శాతం వార్షిక వడ్డీ రేటును ఖరారు చేశారు. బోర్డు ఛైర్మన్, బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ గైర్హాజరులో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ వడ్డీ రేటును 7.6 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించినప్పటికీ, ఉద్యోగుల ప్రతినిధులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన చర్చల తర్వాత ప్రస్తుత 7.7 శాతం వడ్డీని కొనసాగిస్తూ పీఎఫ్, పెన్షన్ సంస్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది.

**ఉద్యోగుల డిమాండ్లు ప్రస్తావన......**

సమావేశంలో ఉద్యోగుల ప్రతినిధులు పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సీఎంపీఎఫ్కు దీర్ఘకాలంగా చందాలు చెల్లించిన ఉద్యోగులకు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేని (నాన్ రిటర్నబుల్) ఉపసంహరణ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే బొగ్గు పరిశ్రమను విడిచి ఇతర ఉద్యోగాల్లో చేరిన వారు తమ సీఎంపీఎఫ్ నిధులను సులభంగా ఉపసంహరించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

**సింగిల్ విండో వ్యవస్థకు డిమాండ్**

పాక్షిక ఉపసంహరణ విధానాన్ని సరళీకృతం చేయడంతో పాటు, పీఎఫ్ మరియు పెన్షన్ సమస్యల పరిష్కారానికి "సింగిల్ విండో" వ్యవస్థను అమలు చేయాలని ఉద్యోగుల ప్రతినిధులు కోరారు. దీనిపై త్వరలో కార్యాచరణ చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

**పెన్షన్ సెటిల్మెంట్లలో జాప్యంపై ఆందోళన**

చెక్కుల క్లియరెన్స్ ఆలస్యం కారణంగా పెన్షన్ సెటిల్మెంట్లు నెలల తరబడి పెండింగ్లో ఉండటం వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశంలో ప్రస్తావించారు. కంపెనీల నుంచి ఆలస్యాలపై సీఎంపీఎఫ్ఓ 12 శాతం వడ్డీ వసూలు చేస్తున్నప్పటికీ ఉద్యోగులకు మాత్రం అనవసర జాప్యాలను ఎదుర్కోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

**సేవా వివరాల్లో వ్యత్యాసాలపై చర్చ**

సీఎంపీఎఫ్ఓ, బొగ్గు కంపెనీల మధ్య సేవా వివరాలు, చందా వివరాల్లో వ్యత్యాసాల కారణంగా పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్ల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలను సమావేశ మినిట్స్లో నమోదు చేయాలని కోరగా, భవిష్యత్తులో ఇరుపక్షాలు సమన్వయంతో డేటా మార్పిడి చేసుకోవాలని నిర్ణయించారు.

**స్టాండింగ్ కమిటీకి కీలక బాధ్యతలు**

సీ-డాక్ సమీక్ష, సీఎంపీఎఫ్ఓ చట్టాల సమగ్ర పరిశీలన, 1948 నాటి వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ, సభ్యుల పాస్బుక్ల నవీకరణ, కోల్ మైన్స్ పెన్షన్ పథకం ఆర్థిక స్థిరత్వంపై అధ్యయనం వంటి అంశాలపై స్టాండింగ్ కమిటీ త్వరగా నివేదిక సమర్పించాలని సమావేశం నిర్ణయించింది. ప్రస్తుతం సీఎంపీఎఫ్ఓ మొత్తం నిధుల పరిమాణం రూ. 1.35 లక్షల కోట్లకు పైగా ఉందని అధికారులు వెల్లడించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు పీఎఫ్, పెన్షన్ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలను వేగవంతం చేయాలని సమావేశం నిర్ణయించింది.

# పట్టణ అభివృద్ధి కనిపించడం లేదా

**అసత్యపు ఆరోపణలు చేస్తే సహించం కాంగ్రెస్ పార్టీ**

**పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్**




**ఖానాపూర్ జూలై 4 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడమ బొజ్జపటేల్ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపాలిటీ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు కనిపించడం లేదా అని అనవసర అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఖానాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్రె గంగాధర్ అన్నారు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు శుద్ధ అబద్ధం అని అన్నారు గత 10 ఏళ్ల అధికారంలో విస్మరించిన పనులన్నీ పట్టణ అభివృద్ధి కోసం అనతి కాలంలోనే 4 కోట్ల 80 లక్షల సిసి రోడ్ల పనులు 6 వార్డులో ఎయిర్టెల్ ఆఫీస్ ప్రాంతంలో7 వార్డులో రామ్ చందర్ సామిల్ వెనుక గల్లీలో 3వార్డులోని శ్రీరామ్ నగర్ 11 వార్డులోని జెకె నగర్, రాజీవ్ నగర్ కాలనీల లో వేసిన సిసి రోడ్లను చూస్తూ కూడా కళ్ళున్న కబోదుల్లా ప్రవర్తిస్తున్న ప్రతిపక్ష నాయకులు తీరు మార్చుకోవాలని గంగాధర్ అన్నారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో సన్న బియ్యం ఇందిరమ్మ ఇల్లు ఉచిత కరెంటు కల్పిస్తున్న విషయం ప్రజలకు తెలుసని మీరన్ని కల్లబొల్లి కబుర్లు ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు కల్పించిన నమ్మే పరిస్థితిలో లేరని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పై అమిత విశ్వాసం పట్టణ ప్రజలు కలిగి ఉన్నారని అన్నారు గతంలో వదిలేసిన అంబేద్కర్ నగర్ మీదుగా వెళ్లే జిలాపూర్ శివారులోని రెయిన్కొని వాగు సుమారు 20 గ్రామాలను కలిపే దాన్ని అర్ధంతరంగా వదిలేసిన తిరిగి పనులు చేయడానికి ఎమ్మెల్యే కృషి చేశారన్నారు దీంతో పాటు తర్లపాడు రహదారిలో గల మరో వాగు బ్రిడ్జి పనులు పనులు అర్ధాంతరంగా వదిలేస్తే పునరుద్ధరణ చేస్తూ నిర్మిస్తున్న అభివృద్ధి కనిపించడం లేదా అని అలాగే ఖానాపూర్ పట్టణంలోని ఇటీవల మంత్స్ సమక్షంలో శంకుస్థాపన చేసి న బొద్దోనికుంట శాంతినగర్ లో 1 కోటి 14 లక్షలతో పిక్నిక్ స్పాట్ల ఏర్పాటు చేసే పనులు ప్రారంభమైనవి కూడా కనిపించడం లేదని కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్రె గంగాధర్ తో పాటు పట్టణ కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజురసత్యం ఏడో వార్డ్ కౌన్సిలర్ నిమ్మల రమేష్ పి ఎ సి ఎస్ సత్తెనపల్లి ఛైర్మన్ అమందు శ్రీనివాస్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ అంకం రాజేందర్ మాజీ మార్కెట్ ఛైర్మన్ గంగ నరసయ్య నాయకులు జన్నా రపు శంకర్ ద్యావతి రాజేశ్వర్ నేత శ్యామ్ మడిగల గంగాధర్ మధురే సత్యనారాయణ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రాజు నాయక్,లోకిని జుని శ్రీహరి లాలు నాయక్ నయీమ్ తదితరులు అన్నారు